ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

అనకాపల్లి

జిల్లా వార్తలు

శనివారం 23 నవంబరు 2024



కల్తీపై కొరడా

» కల్తీ పాలు విక్రయించినందుకు శ్రీ విజయ విశాఖ డెయిరీకి రూ.2 లక్షలు జరిమానా

» పెరుగు కల్తీ చేసిన పంజాబ్ దాబాకు రూ.20 వేలు..

విశాఖ-2 ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

విశాఖ-1 ఇన్‌స్పెక్టర్‌కు అదనపు బాధ్యతలు

- 8లో



బంగారమ్మపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణం

జోరుగా అభివృద్ధి

గ్రామాల్లో శరవేగంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణం

» సబ్బవరం మండలానికి రూ.4.06 కోట్లు కేటాయింపు

» పంచాయతీల్లో 63 పనులు

» వచ్చే నెలాఖరునాటికి పూర్తిచేయాలని లక్ష్యం

సబ్బవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని పలు గ్రామాల్లో సిమెంట్ రహదారుల నిర్మాణం పనులు జోరుగా జరుగుతున్నాయి. 24 పంచాయతీల్లో 63 పనులకు అధికారులు ప్రతిపాదనలు పంపగా, ప్రభుత్వం రూ.4.06 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల పనులు చేపట్టారు. డిసెంబరు నెలాఖరునాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నేతలు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగునీటి కాలువలు నిర్మించే వెసులుబాటు వున్నప్పటికీ గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించింది. పార్టీ అధికారంలోకి వచ్చిన కొత్తలో కేంద్రం ఇచ్చిన నిధులతో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించకుండా, వేరే పథకాలకు మళ్లించింది. దీంతో గ్రామాల్లో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. గోతులు ఏర్పడి వర్షాకాలంలో నడవడానికి వీలుకాని విధంగా తయారయ్యాయి. డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహించేది. దోమలు, ఈగల బెడద పెరిగిపోయి ప్రజలు రోగాలు, వ్యాధులబారిన పడ్డారు. ప్రజలు ఈ సమస్యలను నాటి ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. గత ఎన్నికల సమయంలో గ్రామాల్లో పర్యటించిన కూటమి నేతలు.. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారులను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. చెప్పినట్టుగానే కూటమి ప్రభుత్వం ఏర్పడిన వచ్చిన వెంటనే గ్రామీణాభివృద్ధిపై పాలకులు దృష్టి సారించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్.. 'ఊరూరా పల్లె పండుగ' పేరుతో రాష్ట్రంలోని అన్ని పంచాయతీల్లో ఒకే రోజున గ్రామసభలు ఏర్పాటు చేయించి సమస్యలపై చర్చించారు. ప్రధానంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలకు నిధులు కావాలని పంచాయతీలు తీర్మానాలు చేసి పంపడంతో ఉపాధి హామీ ... మిగతా 8వ పేజీలో

సీఎస్ఆర్ నిధులు స్వాహా

వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా వ్యయం

» గణపర్తి గ్రామం వద్ద శారదా నది గట్టు పటిష్ఠానానికి ఏషియన్ పెయింట్స్ సాయం

» రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.2.71 కోట్లు మంజూరు

» టెండర్లు పిలవకుండా సర్పంచుల పేర్లతో అస్మదీయులకు అప్పగింత

» నాణ్యతాలోపంతో అరకొరగా పనులు

» వరద ఉధృతికి కొట్టుకుపోయిన కట్టడాలు

» మరో రూ.30 లక్షల ఎంపీ నిధులు కూడా వరదార్పణం

» కూటమి ప్రభుత్వం విచారణ జరిపించాలని ప్రజలు డిమాండ్



ఏషియన్ పెయింట్స్ సీఎస్ఆర్ నిధులతో శారదా నది గట్టుకు ఆనుకుని నిర్మించిన సీసీ రిటైనింగ్ వాల్ కొట్టుకొనిపోవడంతో ఇసుక బస్తాలు వేసి, కర్రలను ఊతంగా పెట్టిన దృశ్యం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

కాదేదీ స్వాహాకు అనర్హం అన్న చందంగా వుంది గత వైసీపీ పాలకులు, ఆ పార్టీ నాయకుల తీరు. సామాజిక బాధ్యత కింద గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం కార్పొరేట్ కంపెనీలు, పరిశ్రమల యాజమాన్యాలు ఇచ్చిన సీఎస్ఆర్ నిధులను సైతం వదల్లేదు. అభివృద్ధి పనుల పేరుతో నిధులు మంజూరు చేయించి, వైసీపీ నాయకులు, సర్పంచుల పేర్లతో నామినేషన్ విధానంపై పనులు చేపట్టినట్టు రికార్డుల్లో చూపి, పనులు చేయకుండానే నిధులు స్వాహా చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పుడిప్పుడే బయటపడుతున్న ఈ అక్రమాలపై కూటమి ప్రభుత్వం విచారణ జరిపించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



డైవర్షన్ వాల్ కొట్టుకుపోగా మిగిలిన చిన్న భాగం

ఎలమంచిలి నియోజకవర్గంలోని అచ్యుతాపురం, రాంబిల్లి, పెందుర్తి నియోజకవర్గంలోని పరవాడ మండలాల్లో అనేక భారీ, మధ్య తరహా పరిశ్రమలు ఉన్నాయి. ఆయా పరిశ్రమలు సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద ప్రతి ఏటా వచ్చే నికర లాభాల్లో రెండు శాతం సొమ్మును పరిసర గ్రామాల్లో అభివృద్ధి పనులకు కేటాయించాలి. ఈ నిధులతో సామాజిక, ఆర్థిక, పర్యావరణ సంబంధిత పనులు చేపట్టవచ్చు. సీఎస్ఆర్ నిధుల కోసం ప్రత్యేక బ్యాంకు ఖాతాను తెరిచి దానిలో జమ చేయాలి. ఈ నిధులను కలెక్టర్ పర్యవేక్షణలో విద్య, వైద్య రంగాలు, రహదారుల నిర్మాణం, రక్షిత తాగునీరు, సాగునీటి వనరుల అభివృద్ధి, సామాజిక భవనాల నిర్మాణం, తదితర వాటికి వినియోగించాలి.

రూ.2.71 కోట్లు శారదా నది వరదపాలు

ఇదిలావుండగా మునగపాక మండలం గణపర్తి గ్రామం వద్ద శారదా నది ఎడమ గట్టు బలహీనంగా వుంది. నదిలో వరద ఉధృతి పెరిగితే గట్టుకు గండిపడి సమీపంలోని గణపర్తి, చూచుకొండ, మెలిపాక గ్రామాలు ముంపునకు గురవుతాయి. వందలాది ఎకరాలు నీటమునుగుతాయి. శారదా నది గట్టు పటిష్ఠత, రెండుచోట్ల రిటైనింగ్ వాల్ నిర్మాణానికి స్థానిక రైతుల అభ్యర్థన మేరకు 2022లో అచ్యుతాపురం ఎస్ఈజడ్‌లోని ఏషియన్ పెయింట్స్ కంపెనీ యాజమాన్యం సీఎస్ఆర్ నిధులు రూ.2.71 కోట్లు కేటాయించింది. ఈ పనులకు టెండర్లు పిలవకుండా స్థానిక వైసీపీ నేతలు ఒక ప్రైవేటు సంస్థకు అప్పగించారు. కాసులకు కక్కుర్తిపడి.. నాణ్యత లేకుండా పనులు చేపట్టారు. దీంతో మరుసటి ఏడాది వరద ఉధృతికి రిటైనింగ్ వాల్ నదిలోకి కూలిపోయింది. పనులు పూర్తికాకుండానే రిటైనింగ్ వాల్ కొట్టుకుపోవడంతో ఇసుక బస్తాలను అడ్డంగా వేసి మమ అనిపించారు.

గణపర్తి గ్రామ పరిధిలో శారదా నది ఎడమ గట్టు వైపు డైవర్షన్ వాల్ పనుల కోసం అదే ఏడాది అనకాపల్లి గత ఎంపీ నిధులు రూ.30 లక్షలు కేటాయించారు. డైవర్షన్ వాల్ ద్వారా గణపర్తి, చూచుకొండ పరిసరాల్లో సుమారు 1,200 ఎకరాలకు సాగునీరు అందించాలన్నది లక్ష్యం. దీంతోపాటు గట్టుపై మొక్కలు పెంచాలని నిర్ణయిచాఆరు. ఇక్కడ పనులు చేశారో లేదో తెలియదుగానీ ప్రస్తుతం ఇక్కడ ఎటువంటి నిర్మాణ పనులు కనిపించడం లేదు. డైవర్షన్ వాల్ నదిలో కొట్టుకుపోవడంతో ఇసుక బస్తాలు వేసి, అవి జారిపోకుండా కర్రలను ఊతంగా పెట్టారు. ఈ రెండు పనులకు సుమారు మూడు కోట్ల రూపాయల వరకు ఖర్చు చేసినట్టు రికార్డుల్లో ... మిగతా 8వ పేజీలో

29న ప్రధాని రాక

» అచ్యుతాపురం మండలం పూడిమడకలో ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు శంకుస్థాపన

» హెచ్‌పీసీఎల్ రిఫైనరీ విస్తరణ ప్రాజెక్టు జాతికి అంకితం

» ఏయూ గ్రౌండ్స్ లేదా అనకాపల్లిలో బహిరంగ సభ



విశాఖపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 29వ తేదీన నగరానికి రానున్నారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడక వద్ద ఎన్‌టీపీసీ రూ.85 వేల కోట్లతో నెలకొల్పనున్న గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు ఆయన శంకుస్థాపన చేస్తారు. అలాగే హెచ్‌పీసీఎల్ రిఫైనరీ విస్తరణ ప్రాజెక్టును జాతికి అంకితం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆ రోజు సాయంత్రం ఆంధ్ర విశ్వవిద్యాలయం మైదానంలో లేదా అనకాపల్లి జిల్లాలో బహిరంగ సభలో ప్రధాని ప్రసంగించనున్నారు. ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లకు విశాఖ పట్నం జిల్లా అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. శుక్రవారం అధికారులతో కలెక్టర్ హరేందిర్ ప్రసాద్ సమావేశం నిర్వహించి ఏర్పాట్లు సమీక్షించారు. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి అధికారికంగా పర్యటన వివరాలు వచ్చిన తరువాత బయటకు వెల్లడించనున్నారు.

నర్సీపట్నం ఏఎస్‌డబ్ల్యూఓ శ్యామల సరెండర్

» గోపీనాథ్‌కి అదనపు బాధ్యతలు

నర్సీపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక సహాయ సాంఘిక సంక్షేమ అధికారి శ్యామలను అమరావతిలోని రాష్ట్ర సంచాలకుల కార్యాలయానికి సరెండర్ చేస్తూ ఆ శాఖ డెరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె స్థానంలో నర్సీపట్నం వెనుబడిన తరగతుల సహాయ సంక్షేమ అధికారి గోపీనాథ్‌కి (ఎఫ్ఏసీ) అదనపు బాధ్యతలు అప్పగించారు. వసతిగృహాల పర్యవేక్షణలో ఆమె విఫలమయ్యారన్న కారణంతో సరెండర్ చేసినట్టు తెలిసింది.

ఏపీ ఆయిల్ ఫెడ్ పర్సన్ ఇన్‌చార్జిగా గండి బాబ్జీ బాధ్యతలు స్వీకరణ



ఆంధ్రప్రదేశ్ నూనెగింజల ఉత్పత్తిదారుల సహకార సంస్థ (ఏపీ ఆయిల్ ఫెడ్) పర్సన్ ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పెందుర్తి నియోజకవర్గం ఇన్‌చార్జి గండి బాబ్జీ శుక్రవారం విజయవాడలో బాధ్యతలు స్వీకరించారు. విశాఖ ఎంపీ శ్రీభరత్, మాజీ ఎంపీపీ గండి దేముడు, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు బర్ల రమణ, పలువురు కూటమి పార్టీలకు చెందిన పలువురు నాయకులు హాజరై ఆయనను అభినందించారు. - సబ్బవరం

బడి భోజనం.. నాణ్యత లోపం!

పోషకాహారానికి దూరమవుతున్న విద్యార్థులు

» ప్రభుత్వం ఇచ్చే బిల్లులు చాలడంలేదంటున్న పథకం నిర్వాహకులు

» విపరీతంగా పెరిగిన నిత్యావసర సరకులు ధరలు

» బిల్లులు, వేతనాల చెల్లింపుల్లో జాప్యం

» సెప్టెంబరు నుంచి బకాయిలు

» 'పిల్లల భోజనం' కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి

» సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లడానికి మూడున ఢిల్లీలో ధర్నా

నర్సీపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం నిర్వహణకు ప్రభుత్వం ఇస్తున్న డైట్ బిల్లులు, వేతనాలు చాలకపోవడంతో నిర్వాహకులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. నిత్యావసర సరకుల ధరలు విప రీతంగా పెరిగిపోయిన నేపథ్యంలో ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం ఇస్తున్న నిధులు, వాస్తవ ఖర్చులకు పొంతన వుండడం లేదు. దీంతో విద్యా ర్థులకు నాణ్యతతో రుచికరమైన భోజనం వండి పెట్టడం సాధ్యం కావడంలేదని వాపోతున్నారు. అంతేకాక భోజనం బిల్లులు, తమ వేతనాలు సకాలంలో ఇవ్వక పోవడంతో అప్పులు చేసి విద్యార్థులకు భోజనాలు పెడుతున్నామని చెబుతున్నారు.

జిల్లాలో 1,033 ప్రాథమిక, 148 ప్రాథమికోన్నత, 226 ప్రభుత్వ/ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ... మిగతా 8వ పేజీలో



పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

అప్పులు చేసి నిర్వహిస్తున్నాం



మధ్యాహ్న భోజనం పథకం నిర్వహణకు ప్రభుత్వం ఇస్తున్న డబ్బులు సరిపోవడం లేదు, కూరగాయలు, కిరాణ సరకుల రేట్లు విపరీతంగా పెరిగిపోయాయి. సెప్టెంబరు నుంచి బిల్లులు, మా వేతనాలు అందలేదు. అప్పులు చేసి భోజనాలు పెడుతున్నాం. మాకు వచ్చే వేతనాలు వడ్డీలు చెల్లించడానికి సరిపోతున్నాయి. భోజన పథకం నిర్వాహకుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడానికి డిసెంబరు 3న ఢిల్లీలో ధర్నా నిర్వహిస్తున్నాం. - ప్రసన్న, జిల్లా మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం అధ్యక్షురాలు

భారీగా పశువుల అక్రమ రవాణా

అడ్డరోడ్డు వద్ద ఎస్.రాయవరం పోలీసులు నిఘా

» రెండు కంటైనర్లలో తనిఖీలు

» ఒక కంటైనర్‌లో 111, మరో దానిలో 44 పశువులు

» కిక్కిరిసి ఎక్కించడంతో 19 పశువులు మృత్యువాత





కంటైనర్‌లో కిక్కిరిసి రవాణా చేస్తున్న పశువులు (ఇన్‌సెట్‌లో) మృతిచెందిన పశువులు

ఎస్.రాయవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి):

పశువులను అక్రమంగా తరలిస్తున్న రెండు కంటైనర్ లారీలను శుక్రవారం మండలంలోని అడ్డరోడ్డు సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. ఒకదానిలో 111 పశువులు ఉండగా వాటిల్లో 19 పశువులు చనిపోయాయి. మరో కంటైనర్‌లో 44 పశువులు ఉన్నాయి. దీనికి సంబంధించి ఎస్ఐ విభీషణరావు అందించిన వివరాలిలా ఉన్నాయి.

ఒడిశా రాష్ట్రం నుంచి ఉమ్మడి కృష్ణా జిల్లా హనుమాన్‌జంక్షన్‌కు పశువులను అక్రమంగా తరలిస్తున్నట్టు ఎస్.రాయవరం పోలీసులకు సమాచారం అందింది. దీంతో శుక్రవారం మధ్యాహ్నం అడ్డరోడ్డు వద్ద మాటు వేశారు. ఎలమంచిలి వైపు నుంచి వస్తున్న రెండు కంటైనర్ లారీలను ఆపి తనిఖీ చేశారు. ఒక కంటైనర్‌లో పశువులను కిక్కిరిసి రవాణా చేస్తున్నారు. పోలీసులు లెక్కించగా 111 పశువులు వున్నాయి. అయితే వీటిలో 19 పశువులు అప్పటికే మృతిచెందాయి. చనిపోయిన పశువులను కూడా రవాణా చేస్తున్నారా? లేకపోతే రవాణా చేస్తుండగా చనిపోయాయా? అన్నది విచారణలో నిర్ధారణ అవుతుందని పోలీసులు తెలిపారు. కాగా మరో కంటైనర్‌లో 44 పశువులు ఉన్నాయి. సజీవంగా వున్న 136 పశువులను పెనుగొల్లులోని గో రక్షణ చారిటబుల్ ట్రస్టు వారికి అప్పగించారు. వీటిల్లో 49 ఆవులు వున్నాయి. కాగా మృతి చెందిన పశువులకు పోస్టుమార్టం అనంతరం పెనుగొల్లు సమీపంలో గొయ్యి తీయించి ఖననం చేశారు.

ప్రజా దర్బార్‌లో 'ప్రగడ' వినతులు స్వీకరణ



ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మంగళగిరిలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, పశ్చిమగోదావరి జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావులు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ప్రజా సమస్యల పరిష్కారానికి చక్కని వేదికగా వారు పేర్కొన్నారు.

ఏఐఎస్ఎఫ్ మహా సభల పోస్టర్లు ఆవిష్కరణ

ఎలమంచిలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విజయనగరంలో ఈ నెల 27వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించే ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం ఇక్కడ జిల్లా అధ్యక్షుడు బాబ్జీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. విద్యారంగంలో సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టాలన్నారు. ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు శివ, జగదీష్, శ్రీను, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో ఘనంగా ప్రపంచ మత్స్య దినోత్సవం



కేవీకే శాస్త్రవేత్తల సందేశాన్ని ఆన్‌లైన్ ద్వారా వింటున్న సిబ్బంది, విద్యార్థులు

ఎలమంచిలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని శుక్రవారం స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ సుస్థిరమైన మత్స్య సంపద, జల జీవావరణ వ్యవస్థల సంరక్షణ తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్.బాలకృష్ణన్ మత్స్య పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను ఆన్‌లైన్ మాధ్యమం ద్వారా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కె.సుజాత, డా.కె.విజయలక్ష్మిలతో పాటు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఆంజనేయ ఆలయం వద్ద వనభోజనం

మునగపాక, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంతబయల అభయాంజనేయ ఆలయం ఆధ్వర్యంలో శనివారం వనభోజనం కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల మణికంఠ తెలిపారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చెప్పారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా కోరారు.

కూటమికి ప్రత్యామ్నాయం కాంగ్రెస్సే

- పార్టీ శ్రేణులంతా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి
- సమన్వయకర్తల సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు సుబ్బన్న



పార్టీ సమన్వయకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బన్న

అచ్యుతాపురం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి ప్రత్యామ్నాయ ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్సే అని డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న అన్నారు. మండలంలోని పూడి వైఎస్ఆర్ నగర్‌లో శుక్రవారం జరిగిన పార్టీ సమన్వయకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను పార్టీ శ్రేణులు ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పార్టీ నిర్మాణంలో భాగంగా మండలంలో అన్ని విభాగాల్లో కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం సమన్వయకర్తలకు ఆయా బాధ్యతల పత్రాలను అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త తనకాల అనంతరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయా నియోజకవర్గాల సమన్వయకర్తలు చినబాబు, ఎం.కోటేశ్వరరావు, పి.కొండలరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎంవీఆర్ రాహుల్, పొలమరశెట్టి ఆదిమూర్తి, కాండ్రేగుల సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన



ఘనజీవామృతం తయారీని వివరిస్తున్న సిబ్బంది

ఎలమంచిలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోతిరెడ్డి పాలెంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటైంది. ఈ సందర్భంగా ఏపీ ఎస్‌బీటీ వర్మ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా నాణ్యమైన, రుచికరమైన పంటలను పండించవచ్చునన్నారు. తద్వారా అధిక దిగుబడులు కూడా సాధించవచ్చునని వివరించారు. అనంతరం బీజామృతం, ఘనజీవామృతం, ద్రవ జీవామృతం వంటివాటిని తయారు చేసే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో మోడల్ మేకర్ నారాయణమ్మ, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఆధార్ సేవా కేంద్రాలకు స్పందన



ఆధార్ కార్డుల్లో మార్పులకు విచ్చేసిన విద్యార్థులు

మునగపాక, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం మునగపాక, తోటాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గణపర్తి సచివాలయంలలో ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఆధార్‌కార్డులో మార్పులు, చేర్పులకు సంబంధించి శుక్రవారం అధిక సంఖ్యలో విచ్చేశారు. ఇక్కడ డేటాఫ్ బర్త్, చిరునామా, సర్టిఫికెట్లలో పొరపాట్లు సరిదిద్దడం వంటివి చేపడుతున్నారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా అధికారులు కోరుతున్నారు.

రోడ్డు విస్తరణ కొలతలపై నిర్వాసితులకు తొలగని అనుమానాలు

మునగపాక, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో భాగంగా కొలతలపై నిర్వాసితుల్లో అనుమానాలు నేటికీ తొలగలేదు. కొలతలపై కొంత మంది ఇప్పటికీ అభ్యంతరం వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఇదే విషయాన్ని ఇటీవల అధికారులతో జరిగిన పలు సమావేశాల్లో వెల్లడించారు. అయినప్పటికీ అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదన్న విమర్శలు నిర్వాసితులు నుంచి వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న రోడ్డు మధ్యభాగం నుంచి యాభై అడుగులు చొప్పున అన్ని చోట్ల కొలతలు తీయలేదని పలువురు ఆరోపిస్తున్నారు. కొన్నిచోట్ల తీసిన కొలతలు కొందరి ఆస్తులను కాపాడడం కోసం చేసినట్లుగా ఉన్నాయని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిర్వాసితులు సహకరిస్తే రోడ్డు విస్తరణ పనులు త్వరగా ప్రారంభం అవుతాయని అంటున్న అధికారులు నిర్వాసితులు లేవనెత్తిన అంశాలపై స్పష్టత ఇవ్వడం లేదని అంటున్నారు. గతంలో ప్రకటించిన పరిహారాన్ని కూడా పెంచాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశాలపై స్పష్టత వచ్చాకే రోడ్డు విస్తరణకు సహకరిస్తామంటున్నారు.

ఘనంగా ప్రారంభమైన వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

పాయకరావుపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామివారి వార్షిక ఆరాధనోత్సవాలు పాయకరావుపేటలో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక పార్కు సెంటర్ సమీపంలో శ్రీ కామాక్షి విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేదికపై అర్చకుల ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి చిత్రపటాన్ని ప్రతిష్ఠించి కలశస్థాపన చేశారు. ఈ వేడకకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏపీ కార్పెంటర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదపూడి నర్సింహమూర్తి మాట్లాడుతూ డిసెంబరు రెండో తేదీ వరకు స్వామివారికి రోజూ ఉదయం, సాయంత్రం నిత్య పూజలు జరుపుతామన్నారు. ఈనెల 25న స్వామివారి కళ్యాణం నిర్వహించనున్నామని అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పెదపూడి నర్సింహమూర్తితో పాటు వేమవరపు చిట్టిబాబు, గానుగుల సత్యనారాయణ, సింహాద్రి నరసింహమూర్తి, కొప్పోజు శ్రీను, దివిలి వరహాలబాబు, నాగభూషణం, కొత్తల శ్రీను, రామోజు నాగేశ్వరరావు, మునపర్తి మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులను నియమించరూ..

కృష్ణాదేవిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎకనామిక్స్ అధ్యాపకులను నియమించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. సీఈసీ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో 90 మంది చదువుకుంటున్నామని, తామంతా ఎకనామిక్స్ బోధకులు లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోయారు. ఈ విషయంపై కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీహరి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకపోయిందని చెప్పారు.

ఘనంగా సత్యసాయి సేవా దినోత్సవం



ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినుల నృత్యాలు

అచ్యుతాపురం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఇంటిగ్రేటెడ్ వికలాంగుల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం సత్యసాయి సేవా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం సత్యసాయి బాబా జయంతిని పురస్కరించుకుని స్టీల్‌ప్లాంట్ సత్యసాయి సేవా సమితి యూత్ సేవాదళ్ ఆధ్వర్యంలో దివ్యదర్శ కల్చరల్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో గల 70 మంది దివ్యాంగ విద్యార్థులకు దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పీఎస్‌టీ పట్నాయక్, సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు రామచంద్రరావు, రమణ, రామారావు, పెద్దరాజు, కృష్ణవేణి, లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు తిమ్మరాజుపేటలో...

మునగపాక : తిమ్మరాజుపేటలో సత్యసాయిబాబా జయంత్యుత్సవాలు శనివారం ఘనంగా జరగనున్నాయి. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపట్టినట్టు భగవాన్ సత్యసాయి భజన మండలి కన్వీనర్ సరిసా శివగణేష్ తెలిపారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభం కానున్నాయన్నారు. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా కోరారు.

కూతురు కనిపించలేదని తల్లి ఫిర్యాదు

మునగపాక, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి) : కూతురు కనిపించడం లేదంటూ ఓ తల్లి ఫిర్యాదు చేసినట్టు మునగపాక ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆయన కథనం ప్రకారం వివరాలివి. మండలంలోని ఓ గ్రామానికి చెందిన తల్లీకూతురు రోజూ మాదిరిగానే ఈ నెల 20వ తేదీ రాత్రి ఇంట్లో నిద్రించారన్నారు. సుమారు అర్ధరాత్రి 12 గంటల సమయంలో బాత్‌రూమ్‌కు అని చెప్పి కూతురు వెళ్లిందన్నారు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో ఉదయం బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో ఆమె తల్లి వెతికిందన్నారు. ఫలితం లేకపోవడంతో గురువారం తమకు ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మెరుగైన దంత వైద్యమే 'విజ్జు' లక్ష్యం

ఎలమంచిలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో విస్తరించిన విజ్జు దంత వైద్యశాల మరో విభాగాన్ని విశాఖ సూపర్ స్పెషాలిటీ దంత వైద్యులు డాక్టర్ కె.విజయ్‌కుమార్ రాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి నిర్వాహక వైద్యులు డాక్టర్ సింహాద్రి నాయుడు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలందించడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో పెనుగంటి సునీత, డాక్టర్ రేష్మ, ఉదయశ్రీ, గీతాంజలి, నరసింహమూర్తి, మౌర్య, ఆస్పత్రి సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

బీకేపల్లిలో లేగ దూడల ప్రదర్శన



లేగదూడల ప్రదర్శనలో రైతులకు బహుమతులు అందిస్తున్న అధికారులు

కోటవురట్ల, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీకేపల్లి గ్రామంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధకశాఖ వారి సౌజన్యంతో రాష్ట్రీయ గోకుల్ మిషన్ నిధులతో కృత్రిమగర్భధారణ ద్వారా పుట్టిన లేగ దూడలు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పశునానాభివృద్ధి సంస్థ కార్యనిర్వహక అధికారి డాక్టర్ బెహరా ప్రసాదరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లింగ నిర్ధారణ, వీర్యం, 60 శాతం రాయితీతో అందిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోటవురట్ల సహాయ సంచాలకులు పెట్ల నరేష్ మాట్లాడుతూ వ్యాధికారిక సూక్ష్మక్రిములలో వృద్ధి చెందుతున్న క్రిమిసంహార ఔషధాల నిరోధికతపై అవగాహన కల్పించాలన్నారు. ఈ ప్రదర్శనలో వివిధ జాతులకు చెందిన 42 లేగ దూడలను ఉంచారు. కాగా, 31 పశువులకు గర్భ కోశవ్యాధులకు చికిత్స చేయడం జరిగింది. ఈ ప్రదర్శనకు హాజరైన ప్రతీ రైతుకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెట్ల లింగంనాయుడు, పశు వైద్యాధికారి ప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.

రిటైల్ అమ్మకాలపై విద్యార్థులకు అవగాహన



ఫర్నిచర్ షాపును విజిట్ చేస్తున్న వేంపాడు హైస్కూల్ విద్యార్థులు

నక్కపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతుల విద్యార్థులకు శుక్రవారం వృత్తి విద్యా కోర్సు రిటైల్ అమ్మకాలు అనే అంశంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వ్యాపారానికి సంబంధించి బాల్యం నుంచే విద్యార్థులకు అవగాహన వుండాలన్న ఉద్దేశంతో స్థానికంగా వున్న ఒక ఫర్నిచర్ స్టోర్స్ వద్దకు పిల్లలు తీసుకెళ్లారు. హెచ్ఎం మూర్తిరాజు నేతృత్వంలో విద్యార్థులకు అమ్మకాలు, కొనుగోళ్లు, కస్టమర్ల సర్వీసు తదితర అంశాల గురించి వివరించారు. టెన్త్ విద్యార్థులకు ఒకేషనల్ పరీక్షలు కూడా వుంటాయని, ఈ పరీక్ష పాసైన విద్యార్థులకు ఎస్ఎస్‌సీ బోర్డు ఒకేషనల్ రిటైల్ సర్టిఫికెట్‌ను కూడా అందజేస్తుందని హెచ్ఎం చెప్పారు. ఇటువంటి శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఒకేషనల్ ట్రైనర్ మహేశ్వరి సూచించారు.

భూ సర్వే నిలిపివేయాలని నిరసన

నక్కపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదతీనార్ల రెవెన్యూ పరిధిలో రైతులతో సంప్రదించకుండా, రైతుల ఆమోదం లేకుండా జరుగుతున్న భూ సర్వేను నిలిపివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం పెదతీనార్లలో పలువురు రైతులతో కలిపి భూ సర్వే పట్ల నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్టాన్ని ఉల్లంఘిస్తూ రెవెన్యూ అధికారులు రైతుల భూములను ఎలా సర్వే చేస్తారని ప్రశ్నించారు. తక్షణమే సర్వేను నిలిపివేయాలని, లేకపోతే రైతులతో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు సత్యనారాయణ, ఎం.రాజేశ్, శివాజీరాజు, ఎం.కొర్లయ్య, బుజ్జి, రాజు పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురికి నీరు.. అధికారులు పట్టించుకోరు!

- నెలల తరబడి పేరుకుపోయిన మురుగు
- ఇబ్బందులు పడుతున్న సమీప నివాసితులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



రాజుగారిబీడు శివారులో రోడ్డుపై ప్రవహిస్తున్న మురికినీరు

పాయకరావుపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రాజుగారిబీడు శివారు ప్రాంతంలో ప్రధాన రహదారిపై నెలల తరబడి మురికినీరు ఏరులై పారుతోంది. ఫలితంగా సీసీ రోడ్డు పాడవుతుండడంతో పాటు దుర్వాసన వెదజల్లడంతో సమీప నివాసితులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పాయకరావుపేట పంచాయతీలో సుమారు 5వేల కుటుంబాలు నివసిస్తున్న రాజుగారిబీడులో ప్రధాన వీధుల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు ఏర్పాటు కాగా, మిగిలిన ప్రాంతాల్లో కాలువల్లేక ఇళ్ల ముందు ఇంకుడు గుంతలు (మురికినీరు ట్యాంకులు) ఏర్పాటుచేసుకుని ఇళ్లలోని వాడకం నీటిని వాటిలోకి తరలించుకుంటున్నారు. ఈ ఇంకుడు గుంతలు నిండిన వెంటనే మురికినీటిని బయటకు తరలించుకోవాల్సి ఉండగా, ఈ విషయంలో కొంతమంది ఇళ్ల యజమానులు తీవ్ర జాప్యం చేస్తుండడం వల్ల మురికినీరు రోడ్డుపైకి వస్తుండడంతో పాటు దుర్వాసన వెదజల్లుతుండడంతో సమీప నివాసితులు, రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజుల తరబడి నీరు నిలిచి ఉండడం వల్ల రోడ్డు పాడవుతోంది. ఇదిలా ఉండగా, కాలనీ శివారు ప్రాంతంలో ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ఇంటి ఎదుట ఇంకుడు గుంత నిండిపోయి మురికినీరు నెలల తరబడి రోడ్డుపై ప్రవహిస్తున్నా ఇంటి యజమాని కనీసం పట్టించుకోకపోవడంతో దుర్వాసనతో సమీప నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై పంచాయతీకి ఫిర్యాదుచేసినా పట్టించుకున్న నాథులే లేరు. ఈ సమస్యపై ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలల పనివేళలు మార్చవద్దు

- ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధర్మారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధర్మారావు

నక్కపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాలల పనివేళలను మార్చకుండా యథావిధిగా కొనసాగించాలని, 117 జీవోను ప్రభుత్వం వెంటనే రద్దు చేసి, తక్షణమే ఐఆర్ ప్రకటించి, పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కేకేఎల్ఎన్ ధర్మారావు కోరారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు నక్కపల్లిలో నిర్వహించిన ఏపీటీఎఫ్ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఆర్థిక అంశాలతో కూడిన పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. త్వరలో జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈ సారి కూడా పాకలపాటి రఘువర్మను గెలిపించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్ డి.కొండలరావు, ఏపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు వై.కృష్ణ, అప్పలరాజు, గౌరవ అధ్యక్షుడు ఫల్గుణరావు, ఉపాధ్యక్షుడు నరసింహమూర్తి, యేసుదేవుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌డీఆర్ఎఫ్ సేవలు భేష్

- తహసీల్దార్ రమేష్‌బాబు

ఎస్.రాయవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణతో పాటు ప్రజల ప్రాణాలను కాపాడటంలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు ఎనలేని సేవలు అందిస్తున్నారని తహసీల్దార్ జె.రమేష్ బాబు కొనియాడారు. మండలంలోని అడ్డరోడ్డు తిమ్మాపురంలోని ఆదర్శ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం ప్రకృతి వైపరీత్యాల కారణంగా సంభవించే ప్రమాదాలకు సంబంధించి ప్రాథమికంగా చేపట్టాల్సిన చర్యలపై ఎన్‌డీఆర్ఎఫ్ బృందం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలపై అన్ని మండలాల్లో ప్రజలకు అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టీం కమాండర్ వై.సత్యనారాయణ, ఎస్ఐ విభీషణరావు, సర్పంచ్ కర్రి సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు ఎ.అబద్ధం, స్కూల్ కరస్పాండెంట్ సీతారామరాజు, టీడీపీ సీనియర్ నేత కోన అప్పలరాజు, వీఆర్‌వోలు నూకరాజు, గోపి, విద్యార్థులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం



యూటీఎఫ్ నక్కపల్లి నూతన కమిటీ ప్రతినిధులు

నక్కపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ నక్కపల్లి మండల శాఖ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. సంఘం జిల్లా కోశాధికారి జె.రాజేశ్ ఆధ్వర్యంలో ముందుగా నక్కపల్లిలో సమావేశం నిర్వహించారు. అనంతరం కొత్త కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సీహెచ్ఎస్ఎన్ మూర్తి, అధ్యక్షుడిగా డీఆర్‌కే శాస్త్రి, ఉపాధ్యక్షులుగా బి.నాగమణి, శివయ్య, ప్రధాన కార్యదర్శిగా జి.మహేశ్, కోశాధికారిగా కేవీ సత్యనారాయణ, కార్యదర్శులుగా వి.సూరిబాబు, వి.ఆశాభాను, ప్రశాంతి, ఎం.రాజేశ్, జి.రాజు ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిలర్లుగా జి.రాజబాబు, పీవీ వెంకట్రావ్, మాడెం సత్యనారాయణ, పి.శ్రీకాంత్, వై.ఉమాదేవి, నాయక్, నానాజీ ఎన్నికయ్యారు.

'పేట' కాంగ్రెస్ అసెంబ్లీ కో-ఆర్డినేటర్‌గా నారాయణచక్రవర్తి నియామకం



నియామక పత్రం అందుకుంటున్న చక్రవర్తి

పాయకరావుపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ పాయకరావుపేట అసెంబ్లీ కో-ఆర్డినేటర్‌గా పాయకరావుపేటకు చెందిన మారుతి నారాయణ చక్రవర్తి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న నుంచి నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతానికి తన వంతు కృషిచేస్తానని చెప్పారు. పలువురు నాయకులు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఏడు ఆకుల చెట్లను తొలగించాలని వినతి

ఎస్.రాయవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారం గ్రామంలో ఉన్న విశాఖ డెయిరీ పాల కేంద్రం వద్ద నుంచి జాతీయ రహదారి పక్కన కోస్టల్ సీఫుడ్స్ కంపెనీ వరకు రహదారికి పక్కనే ఉన్న ఏడు ఆకుల చెట్లను తొలగించాలని కోరుతూ శుక్రవారం సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు తహసీల్దార్ జె.రమేష్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు ఆకుల చెట్ల వలన పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. అలాగే ఈ చెట్ల పువ్వుల వాసన, పుప్పొడి వలన శ్వాసకోశ, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు, అలర్జీ వంటివి వస్తాయని పర్యావరణ వేత్తలు, ఆరోగ్య నిపుణులు కూడా చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేత రాజేష్ పాల్గొన్నారు.

బిల్లులు రావని అపోహలు వద్దు

జడ్పీ సీఈవో నారాయణమూర్తి

దేవరాపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) బిల్లులు రావని అపోహ వద్దని జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నుంచి 713 పనులకు రూ.26.09 కోట్లు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఈ నిధులతో చేపట్టి పనుల్లో ఇప్పటి వరకు 72 పనులు పూర్తయ్యాయన్నారు. 450 పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఈ పనులన్నింటినీ డిసెంబరు నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించామన్నారు. ఈ పనులు జరిగినప్పటి నుంచి మూడు దశల్లో ఫొటోలను తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తే బిల్లులు వెంటనే ఇస్తామన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 39 మండలాల్లో ఆరు ఎంపీడీవో పోస్టులు ఖాళీగా ఉండగా, ముగ్గురు దీర్ఘకాలిక సెలవులో ఉన్నారన్నారు. అంతకు ముందు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎంపీడీవో సువర్ణరాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈ చంద్రశేఖర్, ఏపీవో చంద్రకళ, ఏవో లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి ఆర్ఈసీఎస్‌పై

అసెంబ్లీలో వాడీవేడి చర్చ

- సంస్థలో అక్రమాలపై విచారణ జరిపించాలి
- 12 మంది లైన్‌మెన్ల మృతి చెందినా నష్టపరిహారం లేదు
- ప్రభుత్వం తరఫున పర్సన్ ఇన్‌చార్జిని నియమించాలి
- సభలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

విశాఖపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) :అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (ఆర్ఈసీఎస్)పై అసెంబ్లీలో శుక్రవారం వాడీవేడి చర్చ జరిగింది. రాష్ట్రంలో ఎన్ని ఆర్ఈసీఎస్‌లు ఉన్నాయి? వాటి పరిస్థితి ఏమిటనే దానిపై చర్చ సాగింది. అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని ఆర్ఈసీఎస్‌ను తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలో విలీనం చేశారని, అయితే అధికారులు సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇటీవల ఐదు మండలాల్లో 12 మంది లైన్‌మెన్లు మరణించారని సభ దృష్టికి తీసుకువచ్చారు. వారికి నష్టపరిహారం కోరితే ఇవ్వడం లేదన్నారు. కారుణ్య నియామకాల కింద వారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలని కోరినా స్పందించడం లేదన్నారు. అందులో ఒకే రకమైన విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల్లో ఒకరికి నెలకు రూ.10వేలు జీతం ఇస్తే, మరొకరికి రూ.40 వేలు ఇస్తున్నారని ఆరోపించారు. శ్రమ దోపిడీ జరుగుతోందన్నారు. లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ సదుపాయం కల్పించడం లేదని వివరించారు. సంస్థ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాల నిర్వహిస్తున్నారని, అందులో పనిచేసే ఉద్యోగులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని తెలిపారు. అలాగే కళాశాల లైసెన్స్ రెన్యువల్ ఈ నెల24వ తేదీతో ముగుస్తుందని, దానిపై కూడా అధికారులు స్పందించడం లేదన్నారు. ఈ సంస్థకు ప్రభుత్వం తరఫున పర్సన్ ఇన్‌చార్జిని నియమించి, కార్యకలాపాలు సక్రమంగా జరిగేలా చూడాలని కోరారు. అలాగే సంస్థలో అక్రమాలపై 51-ఏ విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనికి మంత్రి అచ్చెన్నాయుడు సమాధానం ఇస్తూ గత ప్రభుత్వంలో ఆర్ఈసీఎస్‌ల నిధులను దుర్వినియోగం చేశారని, దాంతో వాటిని విద్యుత్ రెగ్యులేటర్ కమిషన్ ఆదేశాల మేరకు సంబంధిత డిస్కమ్‌లలో విలీనం చేశారన్నారు. దీనిపై ఢిల్లీ కోర్టులో కేసులు నడుస్తున్నాయని, తగిన చర్యలు చేపడతామని చెప్పారు. సాధ్యాసాధ్యాలు పరిశీలించి, గ్రామీణ ప్రజలకు విద్యుత్ సేవలు సక్రమంగా అందించేందుకు వాటిని తిరిగి సొసైటీలకు అప్పగించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ అంశంపై చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకటరావు కూడా మాట్లాడారు. తన నియోజకవర్గంలో ఆర్ఈసీఎస్ లాభాల్లో నడుస్తున్నదని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో గౌరీ పరమేశ్వరుల ఊంజల్ సేవ



ఆలయంలో ఊంజల్ సేవ నిర్వహిస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెం గౌరీ పంచాయతన ఆలయంలో శుక్రవారం రాత్రి గౌరీ పరమేశ్వరుల ఊంజల్ సేవను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ, పొందూరు సూర్యనారాయణశాస్త్రి, శేషు, సాయిల మంత్రోచ్చారణల నడుమ మళ్ల అప్పలనాయుడు, ఇందిర దంపతులు, కుటుంబసభ్యులు ఊంజల్‌సేవ జరిపారు. ఈ సందర్భంగా వివిధ మహిళా సంఘాలు ఆలపించిన భక్తిగీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, ఇతర కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రాస్ కటింగ్ బ్లేడ్ల చోరీ కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడితో పాటు రికవరీ సొత్తు చూపుతున్న పోలీసు అధికారులు

అనకాపల్లి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విజయరామరాజుపేట సమీపంలో గల పశు వైద్యశాలలో గ్రాస్ కటింగ్ బ్లేడ్లను అపహరించుకుపోయిన కేసులో నిందితుడ్ని శుక్రవారం అరెస్టు చేసినట్టు పట్టణ ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ నెల 17వ తేదీన పశు వైద్యశాలలో 55 గ్రాస్ కటింగ్ బ్లేడ్లను వైద్య సిబ్బంది పెట్టారన్నారు. గురువారం సాయంత్రం అవి మాయమైనట్టు గుర్తించిన పశుసంవర్థక శాఖాధికారిణి బి.సౌజన్య ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విజయరామరాజుపేట ఏఎంసీ కాలనీకి చెందిన కొరుపోలు దుర్గ సన్నిబాబు వీటిని విక్రయించేందుకు నెహ్రూచౌక్ వైపు వస్తుండగా పట్టుకుని అరెస్టు చేశామన్నారు. అతని నుంచి 44 బ్లేడ్లు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

వంతెనలపై గుంతలను పూడ్చాలని ఆందోళన

కొత్తూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ కొత్తూరులో ఉన్న శారదా, కాలేజీ వంతెనలపై గుంతలను పూడ్చి ప్రమాదాల బారి నుంచి ప్రజలను కాపాడాలని ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఆయా వంతెనలపై పడిన పెద్ద పెద్ద గుంతలను శుక్రవారం పరిశీలించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జోనల్ కార్యదర్శి వైఎన్ భద్రం, ఆమ్‌ఆద్మీ పార్టీ నేత కొణతాల హరినాథ్ బాబు, బీఎస్పీ నేత సూదికొండ మాణిక్యాలరావు మాట్లాడుతూ ఈ రెండు వంతెనలపై గోతులు పడి వాహనదారులు తీవ్ర గాయాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి గుంతలను పూడ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వ భూమి కబ్జా.. స్వాధీనం చేసుకున్న రెవెన్యూ



ప్రహరీ గోడను కూల్చివేస్తున్న దృశ్యం

సబ్బవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రభుత్వ భూమి కబ్జాను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. సంతబయలుకు ఎదురుగా సర్వే నంబరు 334/1లో 59 సెంట్ల భూమిని కొంతమంది ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. తహసీల్దార్ బి.చిన్నికృష్ణ ఆదేశాలు మేరకు ఆర్ఐ బి. వీరయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఎక్స్‌కవేటర్‌తో ప్రహరీ గోడను కూల్చివేశారు. గతంలో తహసీల్దార్ రమాదేవి ఇక్కడ రెండుసార్లు ఆక్రమణలు తొలగించి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఆమె బదిలీ అయిన తరువాత ఆక్రమణదారులు హెచ్చరిక బోర్డులు తొలగించి ప్రహరీగోడ నిర్మాణం చేపట్టారు. తహసీల్దార్‌గా వచ్చిన బి.చిన్నికృష్ణ ఆక్రమణలపై దృష్టిసారించి ప్రహరీ గోడను కూల్చివేయించారు.

జిల్లా క్రీడా ప్రాధికారిత సంస్థను ప్రక్షాళన చేయాలి

- టెన్నిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ

తుమ్మపాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రీడా ప్రాధికారిత సంస్థ ప్రక్షాళనకు తక్షణమే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని టెన్నిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్‌వీ సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అనకాపల్లి జిల్లా కేంద్రంగా ఏర్పడిన తరువాత క్రీడల అభివృద్ధికి ప్రోత్సాహం అందించాల్సిన అధికారులు అలసత్వం వహిస్తున్నారని ఆరోపించారు. పలు క్రీడల్లో నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్న క్రీడాకారులకు వెన్నుదన్నుగా ఉండి ప్రోత్సహించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఎన్టీఆర్ స్టేడియం, రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం తదితర క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేయాలని కోరారు. క్రీడా సంస్థలో నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిబంధనలను ఉల్లంఘిస్తే లైసెన్సు రద్దు

- పరిమితికి మించి క్వారీ రాయిని తరలించరాదు
- పాఠశాలలకు విద్యార్థులు వెళ్లే సమయంలో భారీ వాహనాలకు అనకాపల్లిలో అనుమతి లేదు
- డీఎస్పీ శ్రావణి



పరిమితికి మించి రాయిని తరలిస్తున్న లారీలను ఆపి, వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ శ్రావణి

కొత్తూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండల పరిధిలో ఉన్న లారీల్లో క్వారీ రాయిని పరిమితికి మించి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ ఎం.శ్రావణి హెచ్చరించారు. శుక్రవారం ఆమె కొత్తూరు బ్రిడ్జి వద్ద వాహనాలను తనిఖీ చేశారు. పరిమితికి మించి క్వారీ రాయిని తరలిస్తున్న లారీలను పరిశీలించారు. ప్రధానంగా పాఠశాలలకు విద్యార్థులు వెళ్లే సమయంలో క్వారీ లారీలు, అధిక లోడులతో వెళ్తున్న వాహనాలు అనకాపల్లి పట్టణంలో తిరిగేందుకు వీలు లేదని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణను ఆదేశించారు. పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు తిరగడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. తక్షణమే ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సదరు సిబ్బందికి వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే ఆయా డ్రైవర్ల లైసెన్సు రద్దు చేయడంతో పాటు పర్మిట్‌ను రద్దు చేస్తామని ఆమె హెచ్చరించారు. అనంతరం లారీ డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆమె వెంట అనకాపల్లి రూరల్ ఎస్ఐ రవికుమార్, సిబ్బంది ఉన్నారు.

సబ్బవరం పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో

- ప్రార్థనా సమయానికి ముందే చేరుకున్న అప్పారావు
- పని వేళల పెంపుపై విద్యార్థుల అభిప్రాయ సేకరణ
- ఉత్తమ బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచన



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో గిడ్డి అప్పారావు

సబ్బవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను అనకాపల్లి డీఈవో గిడ్డి అప్పారావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం ప్రార్థనా సమయానికి ముందే పాఠశాలకు చేరుకున్నారు. విద్యార్థులతో కలిసి ప్రార్థన చేశారు. అనంతరం వారితో కాసేపు మాట్లాడి సాయంత్రం ఐదు గంటల వరకూ పని వేళలు పెంచడంపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై ఆరా తీశారు. వంట గది, స్టోర్ రూమ్‌ను పరిశీలించి, ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల వివిధ ఆటల పోటీల్లో రాష్ట్రయికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. పాఠ్యాంశాలతో పాటు రోజుకో నీతి కథ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకున్న గొప్ప గొప్పవారి గురించి విద్యార్థులకు వివరించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని పి.రాధా కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాధుల గుర్తింపుపై పీహెచ్‌సీ వైద్యులకు శిక్షణ



వర్కుషాపులో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ బాలాజీ

అనకాపల్లి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులకు శుక్రవారం వర్కుషాపు నిర్వహించారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, టీకాలు వేసిన అనంతరం వచ్చే వ్యతిరేక ఫలితాలు, మీజిల్స్, రూబెల్లా వ్యాధుల వ్యాప్తిపై సర్వేలైన్స్, అకస్మిక పక్షవాత లక్షణాలు, పదిహేనేళ్ల లోపు పిల్లల్లో జ్వరపీడితులు, ఒంటిపై దద్దుర్లు ఉన్నవారిని గుర్తించడం తదితరాలపై శిక్షణ ఇచ్చారు. అలాగే, మరిన్ని వ్యాధుల గుర్తింపుతో పాటు ప్రభుత్వం నిర్వహించే వివిధ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వేలైన్స్ మెడికల్ ఆఫీసర్ జాషువా, డీఎంహెచ్‌వో ఎంఎస్‌వీకే బాలాజీ, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి చంద్రశేఖర్‌దేవ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై పీటీడీ డిపో ఎదుట ధర్నా



డిపో ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇక్కడి పీటీడీ డిపో ఎదుట స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. నైట్ ఔట్, డే ఔట్ అలవెన్సులు, ఇన్సెంటివ్‌లు, టీఏ బిల్లులు, ఇతర అలవెన్సులు చెల్లించాలని, 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, జీవో నంబరు 70, 71లను సమూలంగా మార్చాలని, అన్ని కేటగిరీల్లో పదోన్నతులు కల్పించి తద్వారా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అలాగే మరిన్ని సమస్యలపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, ఫెడరేషన్ అనకాపల్లి డిపో అధ్యక్ష, కార్యదర్శులు బి.అప్పారావు, పీఎస్‌వీ పరమేశ్వరరావులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. బకాయిపడ్డ మూడు ఎన్‌క్యాష్‌మెంట్లు విడుదల చేయాలని, అద్దె బస్సుల డ్రైవర్లకు కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అద్దె బస్సుల వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలకా సత్యనారాయణ, ఫెడరేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బొగ్గు లారీలు ఢీ

- తప్పిన పెను ప్రమాదం



క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన రోహిత్ మహదేవ్

కొత్తూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం కొప్పాక ఏలేరు కాలువ వద్ద శుక్రవారం తెల్లవారుజామున రెండు లారీలు ఢీకొన్నాయి. బొగ్గులోడుతో ఒకదాని వెనుక ఒకటి వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. దీంతో లారీ క్యాబిన్‌లో డ్రైవర్ రోహిత్ మహదేవ్ ఇరుక్కుపోయాడు. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని అతని ప్రాణాలను కాపాడి వెంటనే అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. అయితే ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

అక్రమ క్వారీ, క్రషర్లపై రెవెన్యూ, విజిలెన్స్‌కు ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మామిడిపాలెం సర్పంచ్ పరదేశినాయుడు

తుమ్మపాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మామిడిపాలెం రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 120, 121లలో అక్రమ క్వారీ, క్రషర్లు నిర్వహిస్తున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మామిడిపాలెం సర్పంచ్ పూడి పరదేశినాయుడు కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ అండదండలతో అంజినీ స్టోన్ క్రషర్, ఎంఎస్ రెడ్డి స్టోన్ క్రషర్ల యాజమాన్యాలు దౌర్జన్యాలకు దిగుతూ వ్యాపారాలు సాగిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములను సైతం ఆక్రమించి క్రషర్‌లను విస్తరించి నిర్మాణాలు చేపట్టారని వివరించారు. ప్రభుత్వానికి ఎలాంటి రాయల్టీ చార్జీలు చెల్లించకుండా అక్రమ వ్యాపారాలు సాగిస్తున్నారన్నారు. గతంలో పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. నిబంధనలు ఉల్లంఘించి వ్యాపారాలు సాగిస్తున్న క్వారీ, క్రషర్ల యాజమాన్యాలపై అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

నేడు సబ్బవరంలో జిల్లాస్థాయి సైన్స్ కాంగ్రెస్

లంకెలపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ఎన్విరాన్‌మెంట్ సైన్స్ కాంగ్రెస్-24 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఏపీ నేషనల్ గ్రీన్ క్రాప్స్ జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్.ఖగేశ్వరరావు తెలిపారు. విద్యార్థుల్లో పర్యావరణం పట్ల ఆసక్తిని పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా స్వీకరించడం ప్రధాన అజెండాగా ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా పాఠశాలలో వివిధ అంశాలపై పోటీలు, పదర్శనలు ఉంటాయ న్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించనున్న ఈ పోటీల్లో హైస్కూల్ విద్యార్థులు పాల్గొనేలా జిల్లాలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకోవాలని ఆయన కోరారు.

'ఆడ పిల్లల పట్ల అంతా గౌరవంగా మెలగాలి

సబ్బవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : యువత సన్మార్గంలో నడవాలని ఐద్వా జిల్లా నాయకురాలు పి.ప్రభావతి పిలుపునిచ్చారు. స్థానిక రేంజర్స్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులకు ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రధానంగా బాలికలు, మహిళల పట్ల గౌరవభావం కలిగి ఉండాలన్నారు. నైతిక విలువలతో కూడిన వ్యక్తిత్వం పెంచుకుని ఉన్నత స్థాయిలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. శ్రద్ధగా చదువుకుని తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి, ప్రిన్సిపాల్ పోతల సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మా పరిశ్రమలకు నీటి సరఫరాను వెంటనే పునరుద్ధరించాలి


- సీఐటీయూ నాయకులు డిమాండ్



పరిశ్రమలకు నీటితో వెళ్తున్న ట్యాంకర్ల వద్ద సీఐటీయూ నాయకులు

పరవాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఫార్మాసిటీ, అచ్యుతాపురంలో గల పరిశ్రమలకు గత ఐదు రోజులుగా నీటి సరఫరా లేకపోవడం వల్ల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే నీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి జి.కోటేశ్వరరావు, కోశాధికారి వీవీ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నీటి సరఫరా లేకపోవడం వల్ల యాజమాన్యాలు ట్యాంకర్లతో నీటిని కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఏపీఐఐసీ అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడంతో పాటు రాంకీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. ఈ కారణంగా పరిశ్రమలు మూతపడే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలా పరిశ్రమల్లో ఉత్పత్తి తగ్గిపోయిందని, కాంట్రాక్ట్ కార్మికులకు ఉపాధి కరువైందని పేర్కొన్నారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పరిశ్రమలకు తాగునీరు సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ సందర్భంగా పరిశ్రమలకు నీటితో వెళ్తున్న ట్యాంకర్లను గుర్తించారు. అలాగే కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు లక్ష్మీదేవిపేటలో శూలాల ఉత్సవం



గౌరీ పరమేశ్వరులు

అనకాపల్లి టౌన్, నవంబరు 22 (ఆంధ్ర జ్యోతి) : పట్టణంలోని లక్ష్మీదేవిపేటలో శనివారం గౌరీ పరమేశ్వరుల శూలాల మహోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభం కానున్నాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు బూడిద నాగేశ్వరరావు, ముప్పర లింగేశ్వరరావు, చిన వెంకటరావు తెలిపారు. ఉత్సవం సందర్భంగా రాత్రికి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. భక్తులు మొక్కుబడుల్లో భాగంగా శూలాలు ధరించి ఊరేగింపులో పాల్గొంటారన్నారు.

పోలీసుల అదుపులో 8 మంది పేకాటరాయుళ్లు

అనకాపల్లి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఏఎంసీ కాలనీ శివారులోని బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని గురువారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్టు పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ సంతోష్‌కుమార్ తన సిబ్బందితో వెళ్లి ఎనిమిది మంది పేకాట రాయుళ్ల నుంచి రూ.50,960లతో పాటు ఎనిమిది సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

సంతోషిమాత ఆలయ వార్షికోత్సవంపై సమావేశం

అనకాపల్లి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెం సంతోషిమాత ఆలయ ఉత్సవ కమిటీ శుక్రవారం సమావేశమైంది. వచ్చే నెలలో మొదటి ఏకాదశి, ద్వాదశి పర్వదినాల్లో అమ్మవారి ఆలయ 45వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించాలని నిర్ణయించారు. ఆ సమయంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ఈవో రాజసులోచన, ఉత్సవ కమిటీ చైర్మన్ మారిశెట్టి భాస్కరరావు, సభ్యులు ఎం.ఈశ్వరరావు, పి.సన్యాసినాయుడు, ఆళ్ల రవికుమార్, కె.మణి, అర్చకులు కామేశ్వర్ పాల్గొన్నారు.

24న అనకాపల్లి బ్రాహ్మణ సంఘ వన సమారాధన



విలేకరులకు వివరాలు తెలుపుతున్న సంఘం ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ బ్రాహ్మణ సేవా సంఘం వన సమారాధన ఈనెల 24న జరగనుందని అధ్యక్షులు గంటి రవికుమార్, గౌరవాధ్యక్షులు గౌరీపతి తెలిపారు. ఇక్కడి జార్జిక్లబ్ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కశింకోట మండలం బయ్యవరం వద్ద జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ప్రమీలా గార్డెన్స్‌లో జరగనున్న ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు. ఈ సమావేశంలో ఓరుగంటి నాగమణి, పేరూరు భోగలింగం, చాగంటి సర్వారావులతో పాటు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కళాశాలలో ఆధార్ సేవా కేంద్రం ప్రారంభం



కళాశాలలో ఆధార్ సేవా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

సబ్బవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆధార్ సేవా కేంద్రం ప్రారంభమైంది. ఎంపీడీవో పి.పద్మజ ప్రారంభించారు. ఇక్కడ డేటాఫ్ బర్త్, చిరునామా, సర్టిఫికెట్లలో పొరపాట్లు సరిదిద్దడం వంటివి చేపట్టడం జరుగు తుందన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఎల్‌కేజీ నుంచి ఇంటర్ వరకూ ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్టర్ (అపార్) కార్యక్రమం జోరుగా సాగుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బందితో పాటు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రికి సమస్యలపై నివేదిక



మంత్రికి ఫొటోఫ్రేమ్ అందిస్తున్న బుద్ద నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ప్రొహిబిషన్, ఎక్సైజ్, గనుల శాఖామంత్రి కొల్లు రవీంద్రను మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు శుక్రవారం అమరావతిలోని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో దీర్ఘకాలంగా పేరుకుపోయిన సమస్యలపై సమగ్ర నివేదికను మంత్రికి అందజేసి ఇక్కడి విలేకరులకు తెలిపారు.

చెరువు కబ్జా ఫిర్యాదుపై స్పందించిన తహసీల్దార్



బయ్యవరంచెరువును పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

కశింకోట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆక్రమణకు గురైన బయ్యవరం పెద్ద చెరువును తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. గతంలో ఈ చెరువులో కొంత మంది రైతులు ఆక్రమించుకొని వ్యవసాయం చేసుకునేవారని, ఇటీవల కాలంలో రియల్ ఎస్టేట్ చేసేందుకు కొంత మందికి అమ్మివేసినట్లుగా స్థానికులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో నేరుగా పరిశీలించారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు టీడీపీ నాయకులు చామంతుల రమణారావు ఫిర్యాదు చేయడంతో మండల సర్వేయర్ రామారావు ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి రాళ్లను ఏర్పాటు చేశారు. కాగా బయ్యవరం రెవెన్యూ సర్వే నెంబరు 397.2లో చెరువు మొత్తం 41.3 ఎకరాలు విస్తీర్ణంతో ఉందని దానిలో 49సెంట్లు ఆక్రమణకు గురైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ జేఈ అమూల్య, వీఆర్‌వోలు శ్రీనివాసరావు, కొల్లి సత్యారావు, గ్రామస్థులు కలగా సన్యాసినాయుడు, గొల్లవిల్లి నాయుడు, గండిబోయిన కాశీ, గూడెపు చలపతి, గజ్జాలు, రైతులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

నర్సీపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పేదల గృహ నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేయాలని సీపీఐ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. శుక్రవారం పెదబొడ్డేపల్లి సచివాయం ఎదుట ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాక కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వం 32 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చినప్పటికీ ప్రజలు సముఖత తెలపలేదన్నారు. ఇంటి నిర్మాణాకి ఇచ్చే రూ.1.8 లక్షలు సరిపోక నిర్మాణాలకు ముందుకు రాలేదన్నారు. దీంతో స్థలాలు నిరూపయోగంగా మారాయని చెప్పారు. ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు ఇళ్ల స్థలాల మంజూరుతో పాటు నిర్మాణాలకు సరిపడా నిధులు ఇవ్వాలని కోరారు. పెరిగిన నిర్మాణ సామగ్రి ధరలను దృష్టిలో ఉంచుకొని రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గురుబాబు, శివలంక కొండలరావు తదితరులు పాల్గొన్నారు.


పెదబొడ్డేపల్లిలో సీపీఐ నాయకుల నిరసన

డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచండి

మాకవరపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రామాలయం వీధిలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని బీజేపీ ఓబీసీ మోర్చా నాయకుడు అంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పంచాయతీ ఈవో బాలదొరను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామయలం వీధిలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతినడంతో దోమల బెడద ఎక్కువైందన్నారు. కాలువల్లో మురుగు పారకపోవడంతో వ్యాధులు సోకుతున్నాయన్నారు.పాటు రోడ్లు పూర్తిగా పోయాయన్నారు. ఈ విషయంలో అధికారులు స్పందించాలనికోరారు. ఆయన వెంట బీజేపీ నేత రమేష్ ఉన్నారు.


డ్రోన్ కెమెరా ప్రారంభిస్తున్న పట్టణ పోలీసులు

డ్రోన్ కెమెరాతో నిఘా వ్యవస్థ కట్టుదిట్టం: సీఐ

నర్సీపట్నం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ కెమెరా సాంకేతికతో నిఘా వ్యవస్థను కట్టుదిట్టం చేస్తున్నట్టు పట్టణ సీఐ గోవిందరావు తెలిపారు. పట్టణంలో శుక్రవారం విజ్బుల్ పోలీసింగ్ వ్యవస్థను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హ ఆదేశాల మేరకు కట్టుదిట్టమైన నిఘా వ్యవస్థలో భాగంగా ఈ డ్రోన్ సాంకేతికను వినియోగిస్తున్నట్లు తెలిపారు. పట్టణ పరిధిలో సమస్యాత్మక ప్రదేశాలను గుర్తించి ఈ డ్రోన్ కెమెరా సహాయంతో ఫొటోలు, వీడియోల ద్వారా చట్టవ్యతిరేక కార్యకలాపాలు గుర్తిస్తామన్నారు. దీంతో అయా వ్యక్తులపై తగిన చర్యలు చేపడతామన్నారు. ప్రజలు కూడా ఈ కార్యక్రమానికి సహకరించాలని కోరారు. అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులను, వివాద సంఘటనలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమేష్, పోలీసులు పాల్గొన్నారు.

వైసీపీ మాజీ మండల అధ్యక్షుడు మృతి


నూకరాజు (ఫైల్)

నాతవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ మండల అధ్యక్షుడు శెట్టి నూకరాజు గురువారం రాత్రి మృతి చెందారు. గుండెలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. నూకరాజు మృతికి సర్పంచులు, నాయకులు సంతాపం తెలిపారు.

ఎకనామిక్స్ అధ్యాపకులను నియమించరూ..

కృష్ణాదేవిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎకనామిక్స్ అధ్యాపకులను నియమించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. సీఈసీ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో 90 మంది చదువుకుంటున్నామని, తామంతా ఎకనామిక్స్ బోధకులు లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోయారు. ఈ విషయంపై కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీహరి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరో కళాశాలలో ఉన్న ఎకనామిక్స్ అధ్యాపకులనైనా డిప్యుటేషన్‌పై నియమించాలని వారు కోరుతున్నారు.

బిల్లులు రావని అపోహలు వద్దు

జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి

దేవరాపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) బిల్లులు రావని అపోహ వద్దని జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి తెలి పారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో అయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నుంచి 713 పనులకు రూ.26.09 కోట్లు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఈ నిధులతో చేపట్టి పనుల్లో ఇప్పటి వరకు 72 పనులు పూర్తయ్యాయన్నారు. 450 పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఈ పనులన్నింటినీ డిసెంబరు నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించామన్నారు. ఈ పనులు జరిగినప్పటి నుంచి మూడు దశల్లో ఫొటోలను తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తే బిల్లులు వెంటనే ఇస్తామన్నారు. దేవరాపల్లి మండలంలో 44 పనులకు రూ.12. 99 కోట్లు మంజూరు కాగా, ఈ నిధులతో చేపట్టి పనుల్లో 36 పనులు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. ఏడు పనులు పూర్తయ్యాయన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో మాడుగుల నియోజక వర్గంలో 195 పనులు కోసం రూ27.44 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ఈ పనుల్లో 78 పనులు పూర్తయ్యాయన్నారు. 108 పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. దేవరాపల్లి మేజరు పంచాయతీలో పారిశుధ్య కార్మికులకు ఎనిమిది నెలలుగా జీతాలు రాలేదని సీఈవో దృష్టికి విలేకరులు తీసుకు వెళ్లడంతో, వెంటనే బిల్లు పెట్టాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 39 మండలాల్లో ఆరు ఎంపీడీవో పోస్టులు ఖాళీగా ఉండగా, ముగ్గురు దీర్ఘకాలిక సెలవులో ఉన్నారన్నారు. అంతకు ముందు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎంపీడీవో సువర్ణరాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈ చంద్రశేఖర్, ఏపీవో చంద్రకళ, ఏవో లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గోవాడలో బాల్య వివాహానికి బ్రేక్

పెళ్లి సమయానికి వెళ్లి అడ్డుకున్న ఐసీడీఎస్ అధికారులు


పెళ్లి మండపంలో ఇరు వర్గాలకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

చోడవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవాడ గ్రామంలో బాలిక వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు దగ్గరుండి నిలిపి వేయించారు. ఈ గ్రామంలో బాలికకు వివాహం జరుగుతుందన్న సమాచారం అందడంతో శుక్రవారం ఉదయం ఐసీడీఎస్ పీవో జి.ఉషారాణి ఆధ్వర్యంలో ఐసీడీఎస్ అధికారులు, మహిళా పోలీసులు కల్యాణ మండపం వద్ద మకాం వేశారు. దీంతో బాలిక తల్లిదండ్రులు తమ మేజర్ అని వివరించే ప్రయత్నం చేసినప్పటికీ, అధికారులు మాత్రం మైనర్ అయినట్టు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని స్పష్టం చేశారు. బాలికను తమ ఎదుటకు తీసుకుని రావాలని గట్టిగా చెప్పడంతో, చివరకు పెళ్లి నిలుపుదల చేసేందుకు బాలిక కుటుంబ సభ్యులు అంగీకరించారు. చివరకు ఇటు బాలిక తల్లిదండ్రులతో పాటు పెళ్లి కొడుకు తల్లిదండ్రులతో కూడా ఈ వివాహం చేయబోమని బెండోవర్ రాయించుకున్నారు. బాలిక వివాహాన్ని నిలిపి వేసిన అధికారుల బృందంలో ఐసీడీఎస్ ఏసీడీపీవో పుష్పాదేవి, సూపర్‌వైజర్లు అనిత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. మరికొద్ది సేపట్లో పెళ్లి తంతు ముగుస్తుందన్న సమయంలో అధికారులు వచ్చి నిలిపివేయడం గమనార్హం.



పండ్ల తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కృషి విజ్ఞాన సంస్థ శాస్త్రవేత్త నాగేంద్రప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త నాగేంద్రప్రసాద్

మాకవరపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల్లో తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త నాగేంద్రప్రసాద్ సూచించారు. శుక్రవారం తామరం రైతు సేవా కేంద్రంలో కొబ్బరి, జీడిమామిడి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొబ్బరి తోటల్లో తెగుళు సోకితే వెంటనే తొలగించాలని చెప్పారు. జీడిమామడి తోటల విస్తీర్ణం పూర్తిగా తగ్గిపోతుందని, వీటికి సస్యరక్షణ చేపడితే మంచి దిగుబడులు తద్వారా అధిక ఆదాయం పొందవచ్చని చెప్పారు. ప్రస్తుతం జీడిమామిడి తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. కొద్ది రోజుల్లో పూతలు పూసే సమయం వస్తుందని, ముందుగా వాటికి ఎరువులు పిచికారీ చేస్తే సత్ఫలితాలు వస్తాయని ఆయన తెలిపారు. పొగమంచు సమయంలో తోటలను జాగ్రత్తగా కాపాడుకోవాలని, లేకపోతే పూత దెబ్బతీటుందని హెచ్చరించారు. రైతులు వ్యవసాయ అధికారులు సూచనలు పాటించి మంచి దిగుబడులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీ ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి చిరంజీవి, కోరమండల్ సంస్థ సభ్యుడు ధనంజయ్, పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వ్యాచరచన పోటీల్లో పాకలపాడు విద్యార్థిని ప్రతిభ


విద్యార్థిని సాయిలక్ష్మితో ఉపాధ్యాయులు

గొలుగొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 21వ తేదీన నిర్వహించిన జిల్లా స్థాయి నిర్వహించిన వ్యాచరచన పోటీల్లో పాకలపాడు హైస్కూల్ విద్యార్థిని డి.సాయిలక్ష్మి అద్భుతమైన ప్రతిభ కనబరిచింది. ఈ పోటీల్లో రెండో స్థానంలో నిలిచింది. ఈ మేరకు విద్యార్థిని ఇన్‌చార్జి ఎంఈవోలు మూర్తి, సత్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.



ఆర్‌ఎస్‌కేలో మినుము విత్తనాల పంపిణీ


రైతులకు మిమును విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

గొలుగొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులకు మినుము, పెసర విత్తనాలను శుక్రవారం పంపిణీ చేశారు. జోగంపేట గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో మాజీ సర్పంచ్ సుర్ల బాబ్జి వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి సుధావాణి మాట్లాడుతూ మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో మినుము, పెసర విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది సత్య, నాయకులు జువ్వల దేముడు తదితరులు పాల్గొన్నారు.

శ్లాబ్ పెచ్చులు ఊడిడి విద్యార్థికి గాయాలు


గాయపడ్డ విద్యార్థి లక్ష్మణ్

గొలుగొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల భవనం శ్లాబ్ పెచ్చులు ఊడిపడడంతో ఓ విద్యార్థి నుదుటిపై గాయమైంది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పప్పుశెట్టిపాలెం శివారు నాగందొరపాలెం ప్రాథమిక పాఠశాలలో ఆరుగురు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. శుక్రవారం ఉదమం పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు వరండాలో చూచివాత రాస్తుండగా, శ్లాబ్ పెచ్చులు ఊడి ఐదో తరగతి చదువుతున్న రామపురెడ్డి లక్ష్మణ్ నుదిటిపై పడ్డాయి. దీంతో గాయపడ్డ విద్యార్థిని ఉపాధ్యాయుడు గణేశ్ గొలుగొండ పీహెచ్‌సీకి తరలించారు. ఈ సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఎంఈవో మూర్తి పాఠశాలకు వెళ్లి పరిశీలించారు. శ్లాబ్‌పెచ్చులు ఊడని ప్రదేశంలో విద్యార్థులకు తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులను వారు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


ఏఐఎం ర్యాలీని జయప్రదం చేయాలి

గొలుగొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా అనకాపల్లి జిల్లా కేంద్రంలో ఈ నెల 26వ తేదీన నిర్వహించే ఏఐఎమ్ ర్యాలీని విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు సరమండ వీరబాబు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం ర్యాలీకి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, దాన్ని కాపాడాల్సి బాధ్యత దళితులపై ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల దళిత సంఘం నాయకులు జువ్వల వరహాల బాబు, బొడారపు అప్పారావు, వాడపల్లి సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలకు తరలిరండి


గ్రామాల్లో ఇంటింట ప్రచారం నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

నర్సీపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా మహాసభలకు ప్రజలు తరలిరావాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం రామారావుపేట గ్రామంలో శుక్రవారం ఇంటింట ప్రచారం నిర్వహించారు. అలాగే జిల్లా మహా సభలకు సంబంధించి కరపత్రాలు పంచుతూ ప్రచారం చేపట్టారు. మూడేళ్లకు ఒకసారి నిర్వహించే సీపీఎం జిల్లా మహా సభలు తొలిసారి డిసెంబరు 20, 21 తేదీలో నర్సీపట్నంలో జరుగుతున్నాయని వారు తెలిపారు. విద్యుత్ చార్జీలు, నిత్యావసర సరకులు, పెట్రోల్, వంట గ్యాస్ ధరలు పెరుగుదలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న సీపీఎం పోరాటం చేస్తుందని తెలిపారు. ప్రతీ ఒక్కరు హాజరై మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కోటేశ్వరరావు, అడిగర్ల రాజు, ఈరెల్లి చిరంజీవి, ఎల్.గౌరి, సూర్యప్రభ పాల్గొన్నారు.































మందుబాబులకు అడ్డాగా ఘాట్ రోడ్డు జంక్షన్


ఘాట్ రోడ్డు జంక్షన్‌లో చెరకు కాటా వద్ద చెత్తాచెదారం, మద్యం సీసాలు

చెరకు కాటా ఆవరణలో పేరుకుపోయిన వ్యర్థాలు

తాగేసిన మద్యం సీసాలను పగలకొట్టి పారేస్తున్న వైనం

మోదకొండమ్మ భక్తులకు తప్పని ఇబ్బందులు


రచ్చబండ వద్ద పగిలిన మద్యం సీసాలు, మంట పెట్టి వదిలేసిన చెత్త

మాడుగుల రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంకె.వల్లాపురం చెరకు కాటాగా పిలిచే ఘాట్ రోడ్డు జంక్షన్‌లో మందుబాబులకు అడ్డాగా మారిపోయింది. ఈ కాటా ఆవరణ మందుబాబు తాగి పడేసిన సీసాలు, వ్యర్థాలతో నిండిపోయింది. పరిసరాల్లో వాతావరణం అస్తవ్యస్తంగా తయారైంది. ఫలితంగా దీనికి సమీపంలోనే ఉన్న మోదకొండమ్మ ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలో ఎంకె.వల్లాపురం, వమ్మలి, కేజేపురంలో చెరకు కాటాలు ఉన్నాయి. వీటికి గతంలో సుమారు 70 వేల టన్నుల చెరకు క్రషింగ్‌కు తోలకాలు చేసేవారు. కాలక్రమేణా చెరకు తోలకాలు తగ్గుముఖం పట్టడంతో చెరకు కాటాల పరిస్థితి దయనీయంగా మారింది. చెరకు ఈ నేపథ్యంలో వాటిని మందుబాబులు అడ్డాగా చేసుకున్నారు. వారు మద్యం, తినుబండారాలు తీసుకు వచ్చి అక్కడే వాటిని పడేస్తున్నారు. ఎంకె.వల్లావరం కాటా ఆవరణలో మోదకొండమ్మ ఆలయం ఉంది. ఇక్కడి పరిస్థితులతో ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాటా పరిస్థితిపై గోవాడ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రత్యేక దృష్టిసారించి పరిస్థితులను మెరుగుపరచాలని వారు కోరుతున్నారు.

జేబీపురం వీఆర్‌వోకు ఘన సన్మానం

చీడికాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జేబీపురం రెవెన్యూ క్లస్టర్‌లో వీఆర్‌వోగా పనిచేసిన శ్రీనివాస సన్యాసిరాజును శుక్రవారం గ్రామ సచివాలయంలో ఘనంగా సన్మానించారు. సన్యాసిరాజు ఇటీవల చోడవరం మండలానికి బదిలీపై వెళ్లారు. సన్యాసిరాజుతో పాటు జేబీపురం సచివాలయానికి కొత్తగా వచ్చిన పంచాయతీ కార్యదర్శి వి.సత్తిబాబులను గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్మలు, వైసీపీ మండల నాయకులు గొల్లవిల్లి రాజబాబు, ధర్మిశెట్టి కొండబాబు, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, సచివాలయ ఉద్యోగులు, సచివాలయం పరిధిలోని గ్రామస్థులు ఘనంగా సన్మానించారు.

బిల్లులు రావని అపోహలు వద్దు

జడ్పీ సీఈవో నారాయణమూర్తి

దేవరాపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) బిల్లులు రావని అపోహ వద్దని జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నుంచి 713 పనులకు రూ.26.09 కోట్లు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఈ నిధులతో చేపట్టి పనుల్లో ఇప్పటి వరకు 72 పనులు పూర్తయ్యాయన్నారు. 450 పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఈ పనులన్నింటినీ డిసెంబరు నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించామన్నారు. ఈ పనులు జరిగినప్పటి నుంచి మూడు దశల్లో ఫొటోలను తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తే బిల్లులు వెంటనే ఇస్తామన్నారు. దేవరాపల్లి మండలంలో 44 పనులకు రూ.12. 99 కోట్లు మంజూరు కాగా, ఈ నిధులతో చేపట్టి పనుల్లో 36 పనులు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. ఏడు పనులు పూర్తయ్యాయన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో మాడుగుల నియోజకవర్గంలో 195 పనులు కోసం రూ27.44 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ఈ పనుల్లో 78 పనులు పూర్తయ్యాయన్నారు. 108 పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. దేవరాపల్లి మేజరు పంచాయతీలో పారిశుధ్య కార్మికులకు ఎనిమిది నెలలుగా జీతాలు రాలేదని సీఈవో దృష్టికి విలేకరులు తీసుకు వెళ్లడంతో, వెంటనే బిల్లు పెట్టాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 39 మండలాల్లో ఆరు ఎంపీడీవో పోస్టులు ఖాళీగా ఉండగా, ముగ్గురు దీర్ఘకాలిక సెలవులో ఉన్నారన్నారు. అంతకు ముందు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎంపీడీవో సువర్ణరాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈ చంద్రశేఖర్, ఏపీవో చంద్రకళ, ఏవో లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

మండల అధ్యక్షుడిగా పి.వెంకటరమణ


యూటీఎఫ్ మండల కార్యవర్గ సభ్యులు

దేవరాపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) మండల కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. పెదనందిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కార్యదర్శి దొగ్గ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. మండల అధ్యక్షుడిగా పి.వెంకటరమణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ప్రకాశ్, గౌరవాధ్యక్షుడిగా ఆర్.యర్రయ్యదొర, మహిళా కార్యదర్శిగా పాపమ్మతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

రాయితీపై అపరాల విత్తనాలు

మాడుగుల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాయితీపై అపరాల విత్తనాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ శాఖాధికారి ఎం.వాసుదేవరావు తెలిపారు. మాడుగుల రైతు సేవా కేంద్రంలో శుక్రవారం అపరాల విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఇప్పటికే 25 క్వింటాళ్ల మినుములు, 35 క్వింటాళ్ల పెసర విత్తనాలు పంపిణీకి సిద్ధం చేసినట్టు చెప్పారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు తీసుకొని సమీపంలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఐ.కళావతి, ఎంపీటీసీ సభ్యురాలు పి.విజయలక్ష్మి, ఏఈవో కె.వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.27 కోట్ల ఆర్థిక సంఘం నిధులతో 742 పనులు

▸▸ జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి

కె.కోటపాడు/చీడికాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.27 కోట్లు విడుదల య్యాయని జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. కె.కోటపాడు, చీడికాడ మండలాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లోని అధికారులతో నిర్వహించిన సమీక్షా ససమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో 742 పనులకు ఈ నిధులను ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ పనులన్నీ డిసెంబరు నెలలోగా పూర్తి చేయాలని, పనులు పూర్తయిన వెంటనే నిధులు డ్రా చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పల్లె పండుగ పనులు శర వేగంగా జరుగుతున్నాయన్నారు. విశాఖ జిల్లాలో 140 సీసీ రోడ్లు, 151 గోకులం షెడ్లు, అనకాపల్లి జిల్లాలో 1142 సీసీ రోడ్లు, 851 గోకులం షెడ్లను సంక్రాంతి లోగా పూర్తి చేయాలన్నారు. కె.కోటపాడు మండలంలో రూ.6.29 లక్షలతో 51 సీసీ రహదారులను గుర్తించి పనులు చేపడుతున్నట్టు సీఈవో తెలిపారు. పనులు పూర్తయిన వెంటనే చెల్లింపులు ప్రక్రియ జరుగుతుందన్నారు. వారం వారం నిర్వహించే స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించాలని అధికారులను ఆయన ఆదేశించారు. వివిధ శాఖల ద్వారా మంజూరైన నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయించాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి పథకం ద్వారా చీడికాడ మండలానికి



కె.కోటపాడులో అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో

కోట్లాది రూపాయలు మంజూరయ్యాయని చెప్పారు. జడ్పీ, 15వ ఆర్థిక సంఘం, మండల పరిషత్ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు ఎంతవరకు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. చీడికాడ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరం చాలనందున జడ్పీ నుంచి రూ.20 లక్షలు మంజూరుచేస్తే కార్యాలయ భవనంపై ఒక హాలు నిర్మాణం జరుగుతుందని ఎంపీడీవో హేమచంద్రరావు సీఈవో దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో కె.కోటపాడు ఎంపీడీవో సాంబశివరావు, చీడికాడ మండల పరిషత్ పర్యవేక్షకుడు ఎల్.కామేశ్వరరావు, ఉపాధి పథకం ఏపీవో గంగునాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎస్.కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహానికి బ్రేక్

పెళ్లి సమయానికి వెళ్లి అడ్డుకున్న ఐసీడీఎస్ అధికారులు



పెళ్లి మండపంలో ఇరు వర్గాలకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

చోడవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవాడ గ్రామంలో బాలిక వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు దగ్గరుండి నిలిపి వేయించారు. ఈ గ్రామంలో బాలికకు వివాహం జరుగుతుందన్న సమాచారం అందడంతో శుక్ర వారం ఉదయం ఐసీడీఎస్ పీవో జి.ఉషారాణి ఆధ్వర్యంలో ఐసీడీఎస్ అధికారులు, మహిళా పోలీసులు కల్యాణ మండపం వద్ద మకాం వేశారు. దీంతో బాలిక తల్లిదండ్రులు తమ మేజర్ అని వివరించే ప్రయత్నం చేసినప్పటికీ, అధికారులు మాత్రం మైనర్ అయినట్టు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని స్పష్టం చేశారు. బాలికను తమ ఎదుటకు తీసుకుని రావాలని గట్టిగా చెప్పడంతో, చివరకు పెళ్లి నిలుపుదల చేసేందుకు బాలిక కుటుంబ సభ్యులు అంగీకరించారు. చివరకు ఇటు బాలిక తల్లిదండ్రులతో పాటు పెళ్లి కొడుకు తల్లిదండ్రులతో కూడా ఈ వివాహం చేయబోమని బెండోవర్ రాయించుకున్నారు. బాలిక వివాహాన్ని నిలిపి వేసిన అధికారుల బృందంలో ఐసీడీఎస్ ఏసీడీపీవో పుష్పాదేవి, సూపర్‌వైజర్లు అనిత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. మరికొద్ది సేపట్లో పెళ్లి తంతు ముగుస్తుందన్న సమయంలో అధికారులు వచ్చి నిలిపివేయడం గమనార్హం.

ముషిడిపల్లి ఆలయంలో హుండీ చోరీ

దేవరాపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముషిడిపల్లిలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆలయంలోని రెండు హుండీలను సమీపంలోని మామిడి తోటలోకి తీసుకెళ్లి వాటిని తెరిచి నగదుతోపాటు భక్తులు సమర్పించిన కానుకలను తీసుకెళ్లారు.ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు వాసవీ క్లబ్ అధ్యక్షుడు కొప్పాక అప్పారావు తెలిపారు.

'పట్టాలను ఆన్‌లైన్ చేయడంలో జాప్యమెందుకు'

మాడుగుల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టాలు ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా నేటి వరకూ భూమిని ఆన్‌లైన్ చేయడంలో రెవెన్యూ అధికారులు ఎందుకు జాప్యం చేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న ప్రశ్నించారు. శుక్రవారం రైతులతో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విజె.పురం, ఉరలోవకొండ, వమ్మలి, ఎం.కృష్ణాపురం, రావికమతం, కొమిర గ్రామాల్లో సుమారు 450 మంది గిరిజనులు, దళితులు, పేదలకు ఆరో విడత భూ పంపిణీలో పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరుచేశారని, ఆ భూములను ఆన్‌లైన్ చేయలేదని చెప్పారు. సాగులో ఉన్న భూములు తమ పేరున ఆన్‌లైన్ చేయాలని రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు స్పందించ లేదని వాపోయారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కె.రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఇరటా నరసింహమూర్తి, పార్టీ నేత కార్లి భవానీ తదితరులు పాల్గొన్నారు.

టీఎంఆర్ పశువుల దాణాతో అధిక పాడి దిగుబడి



రైతులకు పశువుల దాణాను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

చీడికాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): టీఎంఆర్ పశువుల దాణాతో పాలు పెరుగుదలతో పాటు వెన్న శాతం కూడా అధికంగా వస్తుందని పెదగోగాడ పశు వైద్యాధికారి కేవీఎస్.రాఘవమ్మ తెలిపారు. మండలంలోని తురువోలు రైతు సేవా కేంద్రం వద్ద సర్పంచ్ మట్టా అప్పారావు, ఎంపీటీసీ సభుఏప్యడు బీశ్ల కోటేశ్వరరావు చేతుల మీదుగా శుక్రవారం పాడి రైతులకు పశువుల దాణాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకొక్క కిలో ఆరున్నర రూపాయల చొప్పున అందిస్తున్నట్టు చెప్పారు. తురువోలు సేవా కేంద్రం వద్ద నేరుగా 200 కిలోలు, అర్జునగిరిలో 800 కిలోల పశు దాణాను పంపిణీ సిద్ధంగా ఉంచామన్నారు. అవసరమైన రైతులు వెంటనే తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేత బొడ్డు శ్రీరామ్మూర్తి, సిబ్బంది కె.రాజేశ్ పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ పోస్టులపై నేడు, రేపు అభ్యంతరాల స్వీకరణ

పాడేరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెడికల్ కాలేజీలో వివిధ విభాగాలకు సంబంధించి పోస్టుల భర్తీకి గతేడాది దరఖాస్తులు చేసిన అభ్యర్థుల నుంచి ఈ నెల 23, 24 తేదీల్లో అభ్యంతరాలను స్వీకరిస్తామని ప్రిన్సిపల్ డాక్టర్ టి.హేమలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారుల మెరిట్ లిస్ట్‌ను ఈ ఏడాది ఫిబ్రవరి 26న విడుదల చేశామన్నారు. మొత్తం 34 విభాగాల్లో 256 పోస్టులకు దరఖాస్తులు చేసిన అభ్యర్థులు, తమ మెరిట్ లిస్ట్‌కు సంబంధించి ఎటువంటి అభ్యంతరాలున్నా శని, ఆదివారాల్లో నేరుగా మెడికల్ కాలేజీకి వచ్చి తెలియజేయవచ్చునన్నారు. అలాగే recruitmentgmcpaderu@gmail.com అడ్రస్‌కు ఈ మెయిల్ ద్వారా అభ్యంతరాలను తెలియజేయవచ్చునని ఆమె సూచించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


సూచనలు చేస్తున్న ఎస్ఐ పి.కె.నాయుడు

డుంబ్రిగుడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అరకు వారపు సంతలో శుక్రవారం వాహనాలను స్థానిక ఎస్ఐ పి.కె. నాయుడు తనిఖీ చేశారు. వాహనదారులు రహదారి నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. వారపు సంతలో వాహనదారులతో సమావేశమై హెల్మెట్ ధారణ, మోటారు వాహన చట్టం గురించి అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, అతివేగం ప్రమాదకరమని హెచ్చరించారు. వాహనాలకు ధ్రువపత్రాలు ఉండాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు, వాహనదారులు పాల్గొన్నారు.

డిసెంబరు 1 నుంచి ప్లాస్టిక్ వస్తువులు నిషేధం


పెదవలస వారపు సంతలో వ్యాపారికి అవగాహన కల్పిస్తున్న ఉద్యోగులు

చింతపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఒక్కసారి వినియోగించే ప్లాస్టిక్ వస్తువులను డిసెంబరు 1 నుంచి నిషేధిస్తున్నట్టు ఎంపీడీవో వై.ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం పెదవలస వారపు సంతలో ఎంపీడీవో, గ్రామ సచివాలయం ఉద్యోగులు ప్లాస్టిక్ నిషేధంపై ప్రచారం చేశారు. ప్లాస్టిక్ వస్తువుల విక్రయం, వినియోగం వద్దన్నారు. ఎంపీడీవో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గిరిజన గ్రామాలు, పర్యాటక ప్రాంతాల్లో పూర్తిగా ప్లాస్టిక్‌ను నిషేధిస్తున్నామన్నారు. వచ్చే నెల నుంచి దుకాణాల్లో ప్లాస్టిక్ సామగ్రి కనిపించరాదన్నారు. పాలిథిన్ కవర్లు వినియోగించరాదని, గోగునార సంచులు మాత్రమే ఉపయోగించాలన్నారు. బీఆర్వో సత్యామణి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సీలేరులో 26న ఉచిత వైద్య శిబిరం

సీలేరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీకే వీధి మండలం సీలేరులోని ఏపీ జెన్‌కో కల్యాణ మండపంలో ఈ నెల 26న విశాఖపట్నం జిల్లా ఆనందపురం రాయల్ ఆసుపత్రి యాజమాన్యం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తోంది. సీలేరుకు చెందిన ఏపీ జెన్‌కో ఫోర్‌మెన్ పి.నారాయణరావు (నానాజీ) సహాయ సహకారాలతో ఏర్పాటు చేస్తున్న ఈ శిబిరానికి ఎముకలు, నరాల వైద్య నిపుణుడు డాక్టర్ లక్ష్మణరావు తదితరులు విచ్చేస్తారు. శిబిరంలో వైద్య పరీక్షల అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని నిర్వాహకులు తెలిపారు. టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, పక్షవాతం, కీళ్లు, మోకాళ్లు, మెడ, వెన్నెముక నొప్పులతో బాధపడుతున్నవారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చినవారికి స్థానిక బాలాజీ రెసిడెన్సీ యజమాని ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తారు. వైద్య శిబిరం కరపత్రాలను గ్రామ పెద్దలు, నిర్వాహకులు శుక్రవారం సీలేరు, పరిసర గ్రామాల్లో పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ దుర్గ, డీసీసీ కార్యదర్శి కారే శ్రీనివాస్, నక్కా జ్ఞానేశ్వరరావు, వానపల్లి అప్పారావు, సుధా పాపారావు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి

ముంచంగిపుట్టు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కిలగాడ పంచాయతీ చెరువుపాకల గ్రామంలో ఎంపీయూపీ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న కె.మత్స్యరాజు(50) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందారు. మత్స్యరాజు ఆకస్మిక మృతితో మండల ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం ఉపాధ్యాయుడు మత్స్యరాజు స్వగ్రామం వనభసింగి పంచాయతీ తడ్డాపల్లిలో అంతిమ సంస్కరణలు పూర్తి చేశారు. మత్స్యరాజు మృతి పట్ల మండల విద్యాశాఖ అధికారి కె.కృష్ణమూర్తితో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ, వివిధ సంఘాలు, పార్టీల నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు కలెక్టర్ ఆదేశం


అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, అధికారులు

పాడేరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు సమర్పించే అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేశ్‌కుమార్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. అధికారుల దృష్టికి ప్రజలు తీసుకువచ్చిన ఆయా సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు అధికారులు జవాబుదారీగా ఉండాలన్నారు.

98 వినతుల స్వీకరణ

మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ దినేశ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డీఆర్వో పద్మలత తదితరులు వివిధ ప్రాంతాల గిరిజనుల నుంచి 98 అర్జీలు స్వీకరించారు. రహదారుల నిర్మాణం, తాగునీటి సదుపాయాలు, ఉపాధి అవకాశాలు, భూమి పట్టాలు, రేషన్ డిపోల ఏర్పాటు తదితర సమస్యలపై అధికంగా వినతులు సమర్పించారు. పాడేరు మండలం గుడివాడకాలనీకి చెందిన బీపీ సింహాచలం తన సాగుభూమికి పట్టా మంజూరు చేయాలని కోరగా, కొయ్యూరు మండలం తీగలమెట్ట వాసులు అమర్, రంజిత్ తమకు ఉపాధి కల్పించాలని కోరారు. అనంతగిరి మండలం బొర్రా పంచాయతీ పూలుగూడ గ్రామస్తులు పరమేశ్వరరావు, కోటేశ్వరరావు తదితరులు గ్రామానికి సిమెంట్ కాంక్రీట్ రోడ్డు మంజూరు చేయాలని కోరగా, హుకుంపేట మండలం పాతకోట పంచాయతీ పి.చింతలూరు ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయుడ్ని నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. హుకుంపేట మండలం బూర్జ ఎంపీటీసీ సభ్యుడు మజ్జి హరి జాకరవలస నుంచి ఎగసల్తాంగి మీదుగా పొంటరిపాడు వరకు రోడ్డు నిర్మించాలని కోరారు. కొయ్యూరు మండలం బూదరాళ్ల సర్పంచ్ ఎస్.ముత్యాలమ్మ పంచాయతీలో పిట్టలపాడు, వంతమర్రి గ్రామాల మధ్య కల్వర్టులు నిర్మించాలని, గుమ్మరేవుల పంచాయతీలో కాకనూరు, కొల్లూరుకోట, బోరుకులుగొంది, నేలజర్తి గ్రామాలకు ప్రత్యేకంగా రేషన్ డిపో ఏర్పాటు చేయాలని బొంబుబాబు, చంద్రరావులు వినతిపత్రం సమర్పించారు.

ఇద్దరు విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లు

ఇద్దరు విభిన్న ప్రతిభావంతులకు జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ ల్యాప్‌టాప్‌లు అందజేస్తూ వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ట్రాన్స్‌జెండర్ల స్వయం సహాయక సంఘాన్ని కలెక్టర్ ప్రారంభించారు. స్వయం ఉపాధి రంగాల్లో వీరికి తగిన శిక్షణ ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి జమాల్‌బాషా, రోడ్లు, భవనాల శాఖ ఈఈ బాల సుందరబాబు, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈ కె.వేణుగోపాల్, జి.డేవిడ్‌రాజు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈ జవహర్‌కుమార్, గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ ఎల్.రజని, ఐటీడీఏ ఏవో హేమలత, డీఎల్‌పీవో పీఎస్.కుమార్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ మాధవీ తదితరులు పాల్గొన్నారు.

పాడేరులో దట్టంగా పొగమంచు


పాడేరు-చింతపల్లి మార్గంలో పొగమంచు

పాడేరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం శీతాకాలం కావడంతో మన్యంపై దట్టంగా మంచు దుప్పటి కప్పుకొంటున్నది. శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు పొగమంచు దట్టంగా కమ్మేసింది. దీంతో లైట్లు వేసుకుని వాహనాలు రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే పొగ మంచుతో మన్యంలోని ప్రకృతి మరింత అందంగా దర్శనమిస్తున్నది. దీంతో పర్యాటకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ముంచంగిపుట్టులో పెరిగిన చలి


చలిమంట కాగుతున్న స్థానికులు

ముంచంగిపుట్టు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధితో చలితీవ్రత పెరిగింది. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా తగ్గుముఖం పట్టడంతో శుక్రవారం ఉదయం పది గంటల వరకు మండల కేంద్రంలో మంచు దట్టంగా కమ్ముకుంది. సాయంత్రం నాలుగు గంటల నుంచే చలి మొదలవుతుంది. దీంతో సాయంత్రం ఎక్కడపడితే అక్కడ చలిమంటలు దర్శనమిస్తున్నాయి. చలి నుంచి ఉపశమనం పొందేందుకు గుంపులుగా కూర్చొని చలిమంటులు కాగుతున్నారు. వారం రోజులుగా చలి పెరగడంతో పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు.

చలికాలం.. జరభద్రం!

ప్రజలకు రాజేంద్రపాలెం వైద్యాధికారిణి సూచనలు

కొయ్యూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చలికాలం ప్రారంభం కావడంతో రోగ నిరోధక శక్తి తగ్గి వైరస్ దాడి చేస్తుందని, న్యుమోనియా, అస్తమా వంటి శ్వాసకోస వ్యాధులు సక్రమించే ప్రమాదమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజేంద్రపాలెం వైద్యాధికారిణి మనోజ్ఞ సూచించారు. చల్లని వాతావరణంతో జలుబు, దగ్గు, గొంతునొప్పి, ఫ్లూ జ్వరం, ఆయాసం, స్వైన్ ఫ్లూ కేసులు పెరుగుతాయన్నారు. అస్తమా, అలర్జీ తదితర శ్వాసకోస వ్యాధుల ముప్పు పొంచి ఉంటుందన్నారు. రోగనిరోధక శక్తి తక్కువ ఉన్న వారిపై వైరస్ త్వరగా దాడి చేస్తుందని వైద్యాధికారిణి హెచ్చరించారు. వాతావరణంలో తేమ శాతం పెరిగి శరీరం పొడిబారినట్లు మారిపోతుందని, పెదవులు, అరికాళ్లు పగులుతాయన్నారు. శరీరంలో తేమ శాతం తగ్గి దురదలు వస్తాయన్నారు. వాతావరణం చల్లగా ఉండటం వల్ల తీవ్రమైన అలర్జీ, పచ్చకామెర్ల వ్యాధి బారిన పడే ప్రమాదం ఉంటుందన్నారు. దగ్గు, ఆయాసం, గాలి పీల్చుకోవటంలో సమస్య వస్తుందన్నారు. గుండె సంబంధ వ్యాధులతో బాధపడే వారు మందులు వాడటంలో అశ్రద్ధ చేయకూడదని సూచించారు. గుండెజబ్బు బాధితులు, బ్లాక్స్ కొలెస్ట్రాల్ ఉన్నవారికి రక్తనాళాల్లో పగుళ్లు ఏర్పడే అవకాశం ఉండటంతో గుండె ఆగిపోయే ముప్పు ఉంటుందన్నారు. పొగమంచు బారిన పడకూడదని, మాస్కులు ధరించి గోరువెచ్చని నీటితో స్నానం చేయాలని, చలిగాలిలో తిరగకూడదని సూచించారు. ఈఎన్‌టీ సమస్యలున్న వారు వేడి ఆహారం తీసుకోవటం, ఫ్రిజ్ నీటికి దూరంగా ఉండడం మంచిదన్నారు. ఇలాంటి సమస్యలు వస్తే వీలైనంత తొందరగా వైద్యులను సంప్రదించి వారి సలహాలు పాటించాలన్నారు. ఎంత జాగ్రత్తగా ఉంటే అంత ఆరోగ్య పరిరక్షణ సాధ్యమవుతుందని వైద్యాధికారిణి సూచించారు.

గిరిజనుడికి పాము కాటు

ముంచంగిపుట్టు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కించాయిపుట్టు పంచాయతీ పెద్దాపుట్టు గ్రామానికి చెందిన పి.అర్జున్ అనే గిరిజనుడికి పాము కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. శుక్రవారం మధ్యాహ్నం గ్రామ సమీపంలో వ్యవసాయ పనులు చేస్తుండగా పొదల నుంచి ఆకస్మికంగా కట్లపాము వచ్చి అర్జున్ కాలిపై కాటు వేసింది. దానిని గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి ప్రైవేటు వాహనంలో తీసుకువచ్చారు. వైద్యాధికారి సంతోష్ బాధితుడికి వైద్య సేవలు అందించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు చెప్పారు.

విద్యావ్యవస్థ అస్తవ్యస్తం

ఉపాధ్యాయుల పనితీరుపై మండల సమావేశంలో ప్రజాప్రతినిధుల నిలదీత


పెదబయలు మండల సర్వసభ్య సమావేశంలోని పాల్గొన్న ప్రజాప్రతినిధులు


మాట్లాడుతున్న ఎంపీడీవో పూర్ణయ్య

పెదబయలు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పెదబయలు మండలం బొంగరం పంచాయతీ కుంభార్ల జీపీఎస్ అక్టోబరు నుంచి నేటికీ పాఠశాల తెరచుకోలేదని, లింగేటి పంచాయతీ వన కొత్తూరు పాఠశాలకు జూన్ నుంచి ఉపాధ్యాయులు రావటం లేదని సభ్యులు ధ్వజమెత్తారు. 193 పాఠశాలలకు మధ్యాహ్నం భోజన పథకం సంబంధించి బియ్యం సక్రమంగా పంపిణీ చేయడం లేదని, అలాగే మెనూ కూడ అమలు చేయడం లేదన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం 14వ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బొండా వరహాలమ్మ అధ్యక్షతన జరిగింది. సమావేశం ప్రారంభం నుంచే వాడివేడిగా సాగింది. మాతాశిశు మరణాలను అరికట్టాలని, గర్భిణులను ప్రసవానికి ముందుగానే ఆస్పత్రికి తరలించేలా వైద్యసిబ్బంది అవగాహన కల్పించాలని సభ్యులు కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ పీఎం జన్మన్ కింద 723 పనులకు గాను, రూ.43.51 కోట్ల నిధులు మంజూరయ్యాయని, పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో పూర్ణయ్య సభ్యులకు వివరించారు. అటవీశాఖ రేంజర్ సర్వసభ్య సమావేశాలకు గైర్హాజరవ్వడంపై ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రంగరావు మాట్లాడుతూ సచివాలయాల్లో 500 రకాల సేవలను అందిస్తున్నారని, సిబ్బంది సమయపాలన పాటించకపోతే.. చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు సేవ చేసేందుకు మనమందరం ఉన్నామని, దానిని గుర్తుపెట్టుకుని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేసి, మండలాభివృద్ధికి కృషిచేయాలని, ఎంపీపీ బొండా వరహాలమ్మ హెచ్చరించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు కూడ బొంజుబాబు, వైస్ ఎంపీపీ రాజుబాబు, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

‘గృహ నిర్మాణ వ్యయం రూ.5 లక్షలకు పెంచాలి’


నిర్మాణ గృహం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కొయ్యూరు/చింతపల్లి/పాడేరు రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) పీఎం జన్మన్ పథకంలో మంజూరు చేసిన గృహాలకు నిర్మాణ వ్యయం రూ.5 లక్షలకు పెంచాలని ,పేదలకు నివేశన స్థలాలు మంజూరు చేయాలన్న డిమాండ్లతో సీపీఐ, సీపీఎం నాయకులు శుక్రవారం కొయ్యూరు, చింతపల్లి, పాడేరు రూరల్ ప్రాంతాల్లో ఆందోళనలు చేపట్టారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ ఆధ్వర్యంలో కొయ్యూరు తహసీల్దారు కార్యాలయం ఎదుట, సీపీఎం నాయకుడు తాంబేలు ప్రసాద్ నాయకత్వంలో తులబాడ గెడ్డ, నిమ్మలపాలెం గ్రామాల్లో నిర్మాణ దశలో ఉన్న గృహాల వద్ద లబ్ధిదారులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఎం జన్మన్ పథకంలో గృహ నిర్మాణాలకు అందించే ఆర్థిక సాయం రూ 2.30 లక్షలు ఏ మాత్రం సరిపోవటం లేదన్నారు. లబ్ధిదారులు అప్పుల పాలవుతున్నారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 5 సెంట్లు వంతున ప్రభుత్వం పేదలకు స్థలం కేటాయించాలని కోరారు. సీపీఐ పాడేరు మండల సహాయ కార్యదర్శి అమర్ నాయకత్వంలో ఐటీడీఏ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం ఐటీడీఏ జరిగిన మీకోసం కార్యక్రమంలో జేసీ అభిషేక్ గౌడ్‌కు వినతిపత్రం అందించామన్నారు. జిల్లా కార్యవర్గ షభ్యులు దేశిది బిమలమ్మ, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కె.రాధాకృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు తనీష్ పాల్గొన్నారు. సీపీఐ చింతపల్లి మండల కార్యదర్శి పేట్ల పోతురాజు నాయకత్వంలో ఆ పార్టీ నాయకులు మండల కేంద్రంలో లబ్ధిదారులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఉప తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. ఎంపీటీసీ సభ్యుడు సెగ్గె సత్తిబాబు పాల్గొన్నారు.


చింతపల్లి ఉప తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ మండల కార్యదర్శి పేట్ల పోతురాజు

నేడు రాజుపాకలులో కోల్ట్ స్టోరేజ్ ప్రారంభం


ప్రారంభం కానున్న శీతల గిడ్డంగి

చింతపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాకలు గ్రామంలో లంబసింగి రైతు ఉత్పత్తిదారుల సంఘం నిర్మించిన కలెక్షన్ సెంటర్, కోల్డ్ స్టోరేజీని హైదరాబాద్ ఐసీఏఆర్-ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ సి.తార సత్యవతి శనివారం ప్రారంభిస్తారు. లంబసింగి ఎఫ్‌పీవో వ్యవసాయ విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేస్తూ మార్కెటింగ్ చేస్తుండడంతో ఎఫ్‌పీవో సభ్యులైన గిరిజన రైతులు అధిక ఆదాయం పొందుతున్నారు. తాజాగా లంబసింగి ఎఫ్‌పీవోకి అత్యుత్తమ పురస్కారాన్ని ఐఐఎంఆర్ అందజేసింది. ఈ మేరకు ఐఐఎంఆర్, రాష్ట్ర ప్రభుత్వంసహకారంతో రాజుపాకలు గ్రామంలో నిర్మించిన కోల్డ్ స్టోరేజ్, కలెక్షన్ సెంటర్, అవుట్‌లెట్స్‌ను డైరెక్టర్ ప్రారంభించనున్నారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఏపీఎస్‌పీఎస్ సీఈవో డాక్టర్ శేఖర్‌రావు బాబు గెడ్డం, జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్ కుమార్, ఐటీడీఏ పీవో వి. అభిషేక్ హాజరుకానున్నారు.

రబీలో సంప్రదాయేతర పంటల సాగుకు అనుకూలం


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి

చింతపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో రబీలో సాంప్రదాయేతర పంటల సాగుకు అనుకూలమని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి అన్నారు. శుక్రవారం నెలవారీ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో రబీ సీజన్‌లో అత్యధిక శాతం భూములను నీటి సదుపాయంలేక ఖాళీగా విడిచిపెడుతున్నారన్నారు. దీంతో గిరిజన రైతులు రెండో పంటను పొందలేకపోతున్నారన్నారు. ఈ ప్రాంతంలో అతి తక్కువ నీటి సదుపాయం, మంచు ఆధారంగా సాగు చేసుకునే పంటను పరిచయం చేయాలన్నారు. ప్రధానంగా కొమ్ముశనగ, పొద్దుతిరుగుడు, ఆవాలు, గోధుమ, లెంటిల్ సాగు చేసుకోవాలన్నారు. ఈ పంటలు పరిశోధన స్థానంలో సాగు చేపట్టి గిరిజన ప్రాంత వాతావరణం, నేలలకు అనుకూలమని నిర్ధారించామన్నారు. వ్యవసాయశాఖ అధికారులు రైతులను ప్రోత్సహించాలన్నారు. ఈ స్సాంప్రదాయేతర పంటల సాగు వల్ల పశుగ్రాసం, అదనపు ఆదాయం పొందవచ్చునన్నారు. రైతులు సాగు ప్రారంభించి నాటి నుంచి పంట కోసే వరకు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పూర్తి సాంకేతిక సహకారం అందిస్తారన్నారు. అనంతరం వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు సాగులో కలిగే చీడపీడలు, తెగుళ్లు, ఇతర సమస్యలను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకొనిరాగా నివారణ చర్యలను వివరించారు. ఈకార్యక్రమంలో పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ కె. బయ్యపురెడ్డి, డాక్టర్ పి.బాల హుస్సేన్ రెడ్డి, డాక్టర్ డి. వెంకటేశ్ బాబు, బీఎస్ సందీప్ నాయక్, పి.జోగారావు, ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి చెట్టి బిందు, అరకు, చింతపల్లి ఏడీఏలు మోహన్‌రావు, కంటా జాహ్నవి, వ్యవసాయ అధికారులు పద్మశోభ, డీఆర్‌సీ అధికారి విజయలక్ష్మి, పశువైద్యాధికారి డాక్టర్ డి. దమయంతి, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి: ప్రిన్సిపాల్


సమావేశంలో మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.భరత్‌కుమార్ నాయక్

అరకులోయ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): డిగ్రీలో చేరిన విద్యార్థులంతా చక్కగా చదువుకుని, ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.భరత్‌కుమార్ నాయక్ హితవు పలికారు. కళాశాల ప్రాంగణంలో శుక్రవారం ఫ్రెషర్స్‌డేని సీనియర్ విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ జూనియర్లను చక్కగా కళాశాలకు ఆహ్వానించడం మంచి పరిణామమన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్థానిక వర్తకసంఘం నాయకుడు, కళాశాల కమిటీ ప్రతినిధి మయూరి రాజారావు మాట్లాడుతూ విద్యార్థులు సోదరభావంతో మెలగాలన్నారు. దండకారణ్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనుబాబు మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఎదగాలన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కళాశాల ప్రాంగణంలో పండగవాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో వార్డెన్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నడింపాలెంలో ఇంటింటికీ కుళాయి


పనులకు కొబ్బరికాయ కొడుతున్న టీడీపీ నాయకురాలు రమాదేవి, చిత్రంలో సర్పంచ్ రాము

కొయ్యూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా నడింపాలెం పంచాయతీలో ఇంటింటికీ రక్షిత నీరు అందించే కార్యక్రమంలో భాగంగా కుళాయిల ఏర్పాటుకు వీలుగా పైపులైన్ పనులను సర్పంచ్ పనసల రాము శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇందులో భాగంగానే ప్రతీ ఇంటి ముంగిటే రక్షిత తాగునీరు అందించాలనే దృక్పథంతో పైపులైన్ వేస్తున్నారన్నారు. ప్రజలు వీటిని సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మహిళా నేత రమాదేవి, పెద్దలు చిన్నబ్బాయి, బుజ్జిబాబు, రాజు, సింహాచలం, వార్డు సభ్యుడు బాబ్జీ, కాంట్రాక్టరు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు అందరి సహకారం అవసరం


కూటమి నాయకులతో మాట్లాడుతున్న సీఐ వినోద్ బాబు

చింతపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో గంజాయి నిర్మూలనకు అందరూ సహకరించాలని స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.వినోద్ బాబు కోరారు. శుక్రవారం నూతనంగా నియమితులైన ఆయనను కూటమి నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో గంజాయిని పూర్తి స్థాయిలో కట్టడి చేసేందుకు ప్రభుత్వం, పోలీసుశాఖ ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గంజాయి తోటలను గుర్తించి ధ్వంసం చేస్తామన్నారు. గంజాయి నియంత్రణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కూటమి నాయకులు, ప్రజలు గంజాయి రవాణా, సాగు సమాచారం తమకు ఇవ్వాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే గంజాయిని పూర్తి స్థాయిలో కట్టడి చేయగలమన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు పర్యాటక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, పార్టీ నాయకులు రీమల ఆనంద్, లక్ష్మణ్, అర్జున్, మహేంద్ర, యశ్వంత్, చిన్న, అప్పారావు, మంగ్లు, అబ్బాయినాయుడు పాల్గొన్నారు.

‘గిరిజన గురుకులాల్లో అవుట్ సోర్సింగ్ విధానం వద్దు’


మోకాళ్లపై నిల్చుని రిలే నిరాహార దీక్షలు చేపట్టిన అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు

పాడేరు రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు వినూత్నంగా మోకాళ్లపై నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.కొండబాబు, ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమను కాంట్రాక్టు గురుకుల ఉద్యోగులుగా మార్చాలని డిమాండ్ చేశారు. తమ సమస్య పరిష్కారం అయ్యేంత వరకు నిరాహార దీక్షలు కొనసాగిస్తామన్నారు. అటెండర్, డ్రైవర్‌కి ఇచ్చేంత వేతనం కూడా తమకు ఇవ్వకపోవడం అత్యంత దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్స్, కేజీబీవీల్లో మూడేళ్ల నుంచి అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న ఉపాధ్యాయులను గత ప్రభుత్వం 2022లో కాంట్రాక్టు గురుకుల ఉపాధ్యాయులుగా మార్చి, 15 ఏళ్లుగా పనిచేస్తున్న తమను విస్మరించిందన్నారు.

కేంద్ర మంత్రి దృష్టికి పాడేరు నియోజకవర్గ సమస్యలు

పాడేరురూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి శుక్రవారం అమరావతిలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె పాడేరు నియోజకవర్గ పరిస్థితులు, సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం సభాపతి అయ్యన్నపాత్రుడు, ఉప సభాపతి రామకృష్ణంరాజు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, హోం మంత్రి అనితలను కలిసి సమస్యలను వివరించినట్లు చెప్పారు. టీసీ సెల్ నాయకులు పోలుపర్తి గోవిందరావు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా ఘాట్ రోడ్డు జంక్షన్

చెరకు కాటా ఆవరణలో పేరుకుపోయిన వ్యర్థాలు

తాగేసిన మద్యం సీసాలు పగలకొట్టి పారేస్తున్న వైనం

మోదకొండమ్మ ఆలయ భక్తులకు తప్పని ఇబ్బందులు

మాడుగుల రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంకె.వల్లాపురం చెరకు కాటాగా పిలిచే ఘాట్ రోడ్డు జంక్షన్‌లో మందుబాబులకు అడ్డాగా మారిపోయింది. ఈ కాటా ఆవరణ మందుబాబు తాగి పడేసిన సీసాలు, వ్యర్థాలతో నిండిపోయింది. పరిసరాల్లో వాతావరణం అస్తవ్యస్తంగా తయారైంది. ఫలితంగా దీనికి సమీపంలోనే ఉన్న మోదకొండమ్మ ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలో ఎంకె.వల్లాపురం, వమ్మలి, కేజేపురంలో చెరకు కాటాలు ఉన్నాయి. వీటికి గతంలో సుమారు 70 వేల టన్నుల చెరకు క్రషింగ్‌కు తోలకాలు చేసేవారు. కాలక్రమేణా చెరకు తోలకాలు తగ్గ ముఖం పట్టడంతో చెరకు కాటాల పరిస్థితి దయనీయంగా మారింది.



ఘాట్ రోడ్డు జంక్షన్‌లో చెరకు కాటా వద్ద చెత్తాచెదారం, మద్యం సీసాలు



రచ్చబండ వద్ద పగిలిన మద్యం సీసాలు, మంట పెట్టి వదిలేసిన చెత్త

చెరకు ఈ నేపథ్యంలో వాటిని మందుబాబులు అడ్డాగా చేసుకున్నారు. వారు మద్యం, తినుబండారాలు తీసుకు వచ్చి అక్కడే వాటిని పడేస్తున్నారు. ఎంకె.వల్లావరం కాటా ఆవరణలో మోదకొండమ్మ ఆలయం ఉంది. ఇక్కడి పరిస్థితులతో ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాటా పరిస్థితిపై గోవాడ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రత్యేక దృష్టిసారించి పరిస్థితులను మెరుగుపరచాలని వారు కోరుతున్నారు.



గోవాడలో బాల్య వివాహానికి బ్రేక్

పెళ్లి సమయానికి వెళ్లి అడ్డుకున్న ఐసీడీఎస్ అధికారులు

చోడవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవాడ గ్రామంలో బాలిక వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు దగ్గరుండి నిలిపి వేయించారు. ఈ గ్రామంలో బాలికకు వివాహం జరుగుతుందన్న సమాచారం అందడంతో శుక్రవారం ఉదయం ఐసీడీఎస్ పీవో జి.ఉషారాణి ఆధ్వర్యంలో ఐసీడీఎస్ అధికారులు, మహిళా పోలీసులు కల్యాణ మండపం వద్ద మకాం వేశారు. దీంతో బాలిక తల్లిదండ్రులు తమ మేజర్ అని వివరించే ప్రయత్నం చేసినప్పటికీ, అధికారులు మాత్రం మైనర్ అయినట్టు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని స్పష్టం చేశారు. బాలికను తమ ఎదుటకు తీసుకుని రావాలని గట్టిగా చెప్పడంతో, చివరకు పెళ్లి నిలుపుదల చేసేందుకు బాలిక కుటుంబ సభ్యులు అంగీకరించారు. చివరకు ఇటు బాలిక తల్లిదండ్రులతో పాటు పెళ్లి కొడుకు తల్లిదండ్రులతో కూడా ఈ వివాహం చేయబోమని బెండోవర్ రాయించుకున్నారు. బాలిక వివాహాన్ని నిలిపి వేసిన అధికారుల బృందంలో ఐసీడీఎస్ ఏసీడీపీవో పుష్పాదేవి, సూపర్‌వైజర్లు అనిత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. మరికొద్ది సేపట్లో పెళ్లి తంతు ముగుస్తుందన్న సమయంలో అధికారులు వచ్చి నిలిపివేయడం గమనార్హం.



గోవాడలో పెళ్లి మండపంలో ఇరు వర్గాలకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఐసీడీఎస్ అధికారులు



ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం నిలిపివేత

రావికమతం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని అక్రమణ చేయడమే కాకుండా బినామీ వ్యక్తులను పురమాయించి జీడిపిక్కల ఫ్యాక్టరీ యాజమాన్యం అక్రమంగా నిర్మాణాలు చేపడుతుందన్న సమాచారంతో తహసీల్దార్ బి.వెంకటరమణ, ఎస్‌ఐ రఘువర్మ రెవెన్యూ, పోలీసు సిబ్బందితో వెళ్లి శుక్రవారం నిర్మాణ పనులను అడ్డుకున్నారు. మండలంలోని గుడివాడ రెవెన్యూ పరిధిలోని పిల్లవానిపాలెం సమీపంలో గొంప మెట్టను ఆనుకుని సర్వే నంబరు 308/2 లో గెడ్డ పోరంబోకు ప్రభుత్వం భూమి ఉంది. ఈ భూమిని ఆనుకుని విశాఖపట్నంకు చెందిన జీడిపిక్కల ప్రోసింగ్ ఫ్యాక్టరీ ఉంది. ఈ ఫ్యాక్టరీని ఆనుకోని ఉన్న తొమ్మిది సెంట్ల ప్రభుత్వ గెడ్డ పోరంబోకు భూమిని జీడిపిక్కల యాజమాన్యం అక్రమణ చేసి, ఆ భూమిని చదును చేయడంతో పాటు చుట్టూ ఫూఎన్సింగ్ పోల్స్ పాతి ప్రహరీలా నిర్మాణం చేస్తున్నారు. దీనిపై గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ సిబ్బందితో కలిసి వెళ్లి ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను క్షుణంగా పరిశీలన చేశారు. ఇది ప్రభుత్వ భూమి కావడంతో నిర్మాణ పనులను నిలిపివేయాలని ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ స్థలంగా హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేయాలని వీఆర్వో నారాయణరావును ఆదేశించారు. ఇకపై ఏ విధమైన నిర్మాణాలు చేసినా కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రఘువర్మ, పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమణ, ఎస్‌ఐ రఘువర్మ



క్వారీ రాయి లోడు లారీలతో ఇబ్బందులు

రోలుగుంట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొవ్వూరు, వెదుళ్లవలస క్వారీల నుంచి అధిక క్వారీ రాయి లోడ్లతో ప్రయాణిస్తున్న లారీలతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం పదుల సంఖ్యలో కొవ్వూరు మీదుగా సమయ పాలన లేకుండా భారీ రాయి లోడుతో వెళుతున్నాయి. ఈ భారీ వాహనాల కారణంగా ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాంబల్లిలో నిర్మితమవుతున్న నేవల్ బేస్‌కు తరలించడానికి కొవ్వూరు, వెదుళ్లవలస, కంచుగుమ్మల ప్రాంతాల్లో ఉన్న క్వారీల నుంచి రాయిని తరలిస్తున్నారని, దీంతో భారీ లోడులతో కొవ్వూరు మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. ఫలితంగా నిత్యం ట్రాఫిక్ సమస్యతో పాటు పాటు రోడ్డు మరమ్మతులకు గురవుతుందని బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు చవ్వాకుల బాష్కరరావు ఆరోపించారు. అలాగే స్కూల్ పిల్లల బస్సులకు వెళ్లే వాహనాలకు కూడా ఇబ్బందులకు ఎదురవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధించి శాఖ అధికారులు క్వారీ లారీల రవాణాను అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు.



అధిక లోడుతో కొవ్వూరులో మీదుగా వెళుతున్న క్వారీ లారీలు



బిల్లులు రావని అపోహలు వద్దు

> జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి

దేవరాపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) బిల్లులు రావని అపోహ వద్దని జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి తెలి పారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నుంచి 713 పనులకు రూ.26.09 కోట్లు నిధులు మంజూరయ్యా యని చెప్పారు. ఈ నిధులతో చేపట్టి పనుల్లో ఇప్పటి వరకు 72 పనులు పూర్తయ్యాయన్నారు. 450 పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఈ పనులన్నింటినీ డిసెంబరు నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించామన్నారు. ఈ పనులు జరిగినప్పటి నుంచి మూడు దశల్లో ఫొటోలను తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తే బిల్లులు వెంటనే ఇస్తామన్నారు. దేవరాపల్లి మండలంలో 44 పనులకు రూ.12. 99 కోట్లు మంజూరు కాగా, ఈ నిధులతో చేపట్టి పనుల్లో 36 పనులు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. ఏడు పనులు పూర్తయ్యాయన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో మాడుగుల నియోజకవర్గంలో 195 పనులకు రూ27.44 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ఈ పనుల్లో 78 పూర్తయ్యాయన్నారు. 108 పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఆరు ఎంపీడీవో పోస్టులు ఖాళీగా ఉండగా, ముగ్గురు దీర్ఘకాలిక సెలవులో ఉన్నారన్నారు. అంతకు ముందు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎంపీడీవో సువర్ణరాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈ చంద్రశేఖర్, ఏపీవో చంద్రకళ, ఏవో లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాతో నిఘా వ్యవస్థ కట్టుదిట్టం: సీఐ

నర్సీపట్నం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ కెమెరా సాంకేతికతో నిఘా వ్యవస్థను కట్టుదిట్టం చేస్తున్నట్టు పట్టణ సీఐ గోవిందరావు తెలిపారు. పట్టణంలో శుక్రవారం విజిబుల్ పోలీసింగ్ వ్యవస్థను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హ్ ఆదేశాల మేరకు కట్టుదిట్టమైన నిఘా వ్యవస్థలో భాగంగా ఈ డ్రోన్ సాంకేతికను వినియోగిస్తున్నట్లు తెలిపారు. పట్టణ పరిధిలో సమస్యాత్మక ప్రదేశాలను గుర్తించి ఈ డ్రోన్ కెమెరా సహాయంతో ఫొటోలు, వీడియోల ద్వారా చట్టవ్యతిరేక కార్యకలాపాలు గుర్తిస్తామన్నారు. దీంతో ఆయా వ్యక్తులపై తగిన చర్యలు చేపడతామన్నారు. ప్రజలు కూడా ఈ కార్యక్రమానికి సహకరించాలని కోరారు. అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులను, వివాద సంఘటనలను పోలీసుల దృష్టికి తీసుకు రావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రమేష్, పోలీసులు పాల్గొన్నారు.



డ్రోన్ కెమెరా ప్రారంభిస్తున్న పట్టణ పోలీసులు





డిప్యూటీ స్పీకర్ రఘురామను కలిసిన జనసేన ఇన్‌చార్జి రాజు

చోడవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టిన కె.రఘురామకృష్ణంరాజును నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పీవీఎస్‌ఎన్ రాజు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గడచిన ఐదేళ్లలో వైసీపీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రఘురామకృష్ణంరాజు సాగించిన పోరాటాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తూ, డిప్యూటీ స్పీకర్‌గా రాష్ట్ర పురోభివృద్ధికి అదే పోరాట స్ఫూర్తిని చూపాలని కోరారు. అలాగే శాసనసభ గౌరవాన్ని మరింత ఇనుమడింపజేయాలని రాజు విజ్ఞప్తి చేశారు.



బ్రాహ్మణ కార్తీక సమారాధన రేపు

చోడవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక గణేశ గాయత్రీ బ్రాహ్మణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం బ్రాహ్మణ కార్తీక సమారాధన నిర్వహిస్తున్నట్టు గణేశ గాయత్రీ బ్రాహ్మణసేవాట్రస్ట్ ప్రతినిధి ఉపాధ్యాయుల శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. పట్టణ శివారు చీడికాడ రోడ్డులోని కూరెళ్లవారితోటలో నిర్వహిస్తున్న ఈ కార్తీక సమారాధనకు బ్రాహ్మణ సంఘం ముఖ్య నాయకులు, ప్రముఖులు హాజరవురతున్నందున, ఈ కార్తీక వనసమారాధన విజయవంతం చేయాలని శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

ఘనంగా క్రీస్తురాజు పండగ

చోడవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు గాంధీగ్రామం ఆర్‌సీఎం చర్చిలో గురువారం రాత్రి క్రీస్తురాజు పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పండగలో క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

యూటీఎఫ్ మాడుగుల కార్యవర్గం ఎన్నిక

మండల అధ్యక్షుడిగా పి.వెంకటరమణ


దేవరాపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) మండల కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. పెదనందిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కార్యదర్శి దొగ్గ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. మండల అధ్యక్షుడిగా పి.వెంకటరమణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ప్రకాశ్, గౌరవవాధ్యక్షుడిగా ఆర్.యర్రయ్యదొర, మహిళా కార్యదర్శిగా పాపమ్మతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.



యూటీఎఫ్ దేవరాపల్లి మండల కార్యవర్గ సభ్యులు









అభాగ్యులకు ఆసరా

సమాజ సేవే పరమావధి

ఆదర్శంగా సాయి హెల్పింగ్ హ్యాండ్స్

(పెందుర్తి-ఆంధ్రజ్యోతి)

జీవితంలో నిలదొక్కుకోలేదు. స్థితిమంతుడూ కాదు.. మందుల దుకాణం నిర్వహిస్తూ వచ్చిన ఆదాయంతోనే కుటుంబాన్ని పోషించుకోవాల్సిన పరిస్థితి. అయినా...అవసరంలో ఉన్న తోటి మనిషికి సాయం చేయాలనే ఆలోచన, తపన మార్గాన్ని చూపించింది. తనకున్న దాంట్లో కొంత పంచే గుణమున్నప్పటికీ, మరింత మంది దాతల సాయంతో ఎంతోమందిని ఆదుకోవచ్చునే భావంతో సాయి హెల్పింగ్ హ్యాండ్స్ పేరుతో ఓ సంస్థను ఏర్పాటుచేశారు. తాను ముందుండి సమాజసేవే పరమావధిగా సంస్థను నడిపిస్తున్నాడు పెందుర్తి మండలం చింతల అగ్రహారానికి చెందిన దాడి శ్రీనివాస్.

ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అత్యవసర శస్త్రచికిత్సకు రక్తం అవసరమైంది. ఫోన్ రావడంతోనే యువకుడి గ్రూపు రక్తం కోసం చాలామందిని సంప్రదించాడు. అవసరమైన రక్తం సమకూరింది. యువకుడు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఇది శ్రీనివాస్‌ను బాగా కదిలించింది. ఆపదలో ఉన్న వారిని ఆదుకోకుంటే మానవ జన్మకు సార్థకత లేదని భావించాడు. అంతే 'సాయి హెల్పింగ్ హ్యాండ్స్' పేరిట 2016లో సంస్థకు అంకురార్పణ చేశాడు. చింతల అగ్రహారానికి దాడి శ్రీనివాస్‌కు పెందుర్తిలో ఓ మెడికల్ స్టోర్స్ ఉంది. ఆ సంపాదనతోనే కుటుంబాన్ని పోషిస్తూ, పలువురికి సాయం చేస్తుండేవాడు. ఇది వ్యక్తిగతంగా సంతృప్తిని ఇస్తున్నప్పటికీ అంతకు మించి చేయాలనే తపన ఉంది. దీంతో ట్రస్ట్ ఏర్పాటుచేయడం ద్వారా విభిన్న రంగాలు, వృత్తుల్లో ఉన్న సేవాభావం గల యువతను సంప్రదించాడు. ఆసక్తి కలిగిన యువత చేతులు కలిపారు. ఇలా 15 మంది యువతీ, యువకులు సామాజిక సేవ చేస్తున్నారు.

సోషల్ మీడియా వేదికగా...

ఈ ట్రస్ట్‌లో ఇంజనీరింగ్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఉద్యోగం, వ్యాపారం చేస్తున్న అనేక ప్రాంతాలకు చెందిన యువత భాగస్వాములయ్యారు. సామాజిక మాధ్యమాలను వినియోగించుకుంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.తీటీటీ.ట్రజీబ్రిజూఇజీఃఙ్ప్రిచీటౌటజజీ, సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఫేస్‌బుక్ ఖాతాతో పేజీని రూపొందించారు. కార్యక్రమాల నిర్వహణకు నిధులు ఆశించకుండా తమ సొంత డబ్బునే వినియోగిస్తుండడం ఈ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

సంస్థ విశేషం.

విద్య, ఆరోగ్యం వంటి సమస్యలున్న ప్రాంతాలను గుర్తించి, సేవకు ఉపక్రమిస్తారు. క్షేత్రస్థాయి పరిశీలన చేసి, సాయం అవసరమైన వారిని గుర్తిస్తారు. ఈ క్రమంలో రక్తదానం, వైద్య శిబిరాల నిర్వహణ, నిరుపేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ లాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. వృద్ధులు, అభాగ్యులకు అన్నదానం, అనాథలు, మానసిక స్థితి సరిగా లేనివారిని పోలీసుల సహకారంతో ఆశ్రమాల్లో చేర్పించడం లాంటి కార్యక్రమాలు చేస్తున్నారు.

దయార్ద్రగోడకు విశేష స్పందన

ట్రస్ట్ సేవలు విస్తృతం చేయాలన్న సంకల్పంతో పెందుర్తి కూడలిలో దయార్ద్ర గోడను ఏర్పాటుచేశారు. ఇక్కడ మనకు అవసరం లేని పాత బట్టలు, సామగ్రి వదిలి వెళ్లవచ్చు. అవసరమైన వాటిని తీసుకోవచ్చు. ఈ గోడపై ఉన్న సెల్ నంబరును సంప్రతిస్తే ట్రస్ట్ సభ్యులు వచ్చి, ఇచ్చినవి తీసుకుని అవసరమైన వారికి అందిస్తారు. వివాహాలు, ఇతర కార్యక్రమాల్లో మిగిలిపోయిన ఆహారాన్ని అప్పగిస్తే, అభాగ్యుల ఆకలి తీరుస్తారు. వీటితో పాటు స్వచ్ఛ భారత్, అవయవదానం, వ్యాధుల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి శ్రీనివాస్‌కు ఇటీవల సావిత్రీ భాయి పూలే అవార్డు దక్కింది.

సేవలు విస్తరిస్తాం



సాయి హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు విస్తృతం చేసే ఆలోచనలో ఉన్నాం. ఇందుకు సాయం చేసే చేతుల కోసం చూస్తున్నాం. యువ చైతన్యం ద్వారా సోషల్ మీడియాలో సేవపై అవగాహన కల్పిస్తున్నాం. స్వచ్ఛందంగా సేవ చేయాలనే ఆలోచన ఉన్నవారెవరైనా ఇందులో చేరొచ్చు. ఈ క్రమంలో 1280 ఆదాయ పన్ను శాఖ నుంచి గుర్తింపు సాధించగలిగాం. సలహా, సహాయం కోసం 8639999343 నంబరులో సంప్రతించవచ్చు.

- దాడి శ్రీనివాస్, ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

క్రైం... crime news

కారు ఢీకొని వ్యక్తి మృతి

కశింకోట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతిచెందాడు. సీఐ అల్లు స్వామినాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలానికి చెందిన అందాల యోగేశ్వరరావు (52) సుమారు ఏడాది క్రితం కుటుంబ సభ్యులతో విభేదించి ఇంటి నుంచి బయటకు వచ్చేశాడు. అప్పటి నుంచి అనకాపల్లి, కశింకోట ప్రాంతాల్లో కూలి పనులు చేసుకుంటూ ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి కశింకోటలో అమ్మవారి పండుగ చూసేందుకు వచ్చాడు. అనంతరం స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయం వద్ద జాతీయ రహదారి దాటుతుండగా ఎలమంచిలి వైపు నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న కారు ఢీకొంది. దీంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కశింకోట వీఆర్‌వో ఎం.చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని సీఐ చెప్పారు.

మంత్రిపాలెంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

లంకెలపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) 85వ వార్డు పరిధి మంత్రిపాలెం జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం గృహ సముదాయం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి వున్నట్టు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ముళ్ల పొదల మధ్య గుర్తు పట్టలేని స్థితిలో మృతదేహం ఉంది. సుమారు నెల రోజుల కిందట మృతిచెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. ఇతనికి సుమారు 40 ఏళ్లు వుంటాయని, మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవని, పోస్టు మార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయాలనికి తరలించామని, రెండు రోజుల పాటు అక్కడ భద్రపరుస్తామని పోలీసులు వెల్లడించారు.

కలాసీలపై దాడి కేసులో ముగ్గురి అరెస్టు

రాంబిల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఆర్థిక మండలిలోని ఫార్మా కంపెనీల వద్ద కలాసీలపై దాడికి పాల్పడిన కేసులో ముగ్గురు నిందితులను శుక్రవారం అరెస్టు చేసినట్టు సీఐ నరసింగరావు తెలిపారు. ఈ నెల 20వ తేదీ రాత్రి కలాసీలు, పూడిమడకకు చెందిన కొంతమంది మధ్య జరిగిన కొట్లాటలో పలువురికి గాయాలయ్యాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మైలపల్లి జగదీశ్, గనగళ్ల భాను, పి.నవీన్‌లను అరెస్టు చేసి ఎలమంచిలి కోర్టులో హాజరుపరిచారు.

వంద కిలోల గంజాయి పట్టివేత

» ఆరుగురి అరెస్టు.. ఐదుగురు పరారీ

అనంతగిరి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ నుంచి రెండు స్విఫ్ట్ కార్లలో మైదాన ప్రాంతానికి గంజాయి తరలిస్తున్న ముఠాను అనంతగిరి పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ డి. శ్రీనివాసరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రం అనంతగిరిలో శుక్రవారం వాహన తనిఖీలు చేపడుతుండగా.. అరకు వైపు నుంచి వచ్చిన రెండు స్విఫ్ట్ కార్లను ఆపి తనిఖీ చేయగా వంద కిలోల గంజాయి బయటపడింది. గంజాయి స్వాధీనం చేసుకుని, తమిళనాడు రాష్ట్రానికి చెందిన ముగ్గురు యువకులు, అల్లూరి జిల్లా అరకులోయ ప్రాంతానికి ముగ్గురు యువకులను అరెస్టు చేయగా.. ఐదుగురు వ్యక్తులు పరారీ అయ్యారని ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలను వెల్లడిస్తామని తెలిపారు.

శారదా నదిలో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం



వృద్ధుడి మృతదేహం

దేవరాపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేవరాపల్లికి ఆనుకొని ప్రవహిస్తున్న శారదా నదిలో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. పినకోట రోడ్డుకు ఆనుకొని ప్రవహిస్తున్న నదిలో మృతదేహం తేలియాడుతున్న విషయాన్ని గమనించిన కొంతమంది పోలీసులకు సమాచారం చేరవేశారు. వెంటనే ఎస్‌ఐ టి.మల్లేశ్వరరావు చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ఈ వృద్ధుడు ఎవరన్నది తెలియరాలేదు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

అభివృద్ధి పనులు పర్యవేక్షించాలి

» లక్ష్యం మేరకు త్వరగా పూర్తి చేయాలి

» ఎంపీడీవోలకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

» అభివృద్ధి పనులు, సంక్షేమంపై పలు శాఖల అధికారులతో సమీక్ష



సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పర్యవేక్షణ బాధ్యత ఎంపీడీవోలదేనని కలెక్టర్ విజయకృష్ణన్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో శుక్రవారం డ్వామా, పంచాయతీరాజ్, జిల్లా పంచాయతీ, రోడ్లు-భవనాలు, గ్రామీణాభివృద్ధి, తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆయా శాఖల ద్వారా అమలవుతున్న పనుల పురోగతి, సంక్షేమ పథకాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, క్లాప్ మిత్రలకు ప్రతి నెలా సక్రంగా వేతనాలు చెల్లించాలని స్పష్టం చేశారు. రోడ్లపై గుంతలు పూడ్చివేత పనులను వేగవంతం చేయాలన్నారు. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని, ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకం అర్హులందరికీ అందేలా చూడాలని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా గణాంక అధికారి రామారావు, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు జిల్లా డీసీఎం కమిటీ సమావేశం

జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమీక్షా సమావేశం శనివారం కలెక్టరేట్‌లో జరుగుతుందని జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, అధికారులతో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, నిర్వహణపై సమీక్ష జరుగుతుందన్నారు.

సీఎస్ఆర్ నిధులు స్వాహా

... 5వ పేజీ తరువాయి

వున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం కానరావడంలేదు. సీఎస్ఆర్ నిధులు వైసీపీ నేతల జేబుల్లోకి వెళ్లాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కనిపించని బోర్డులు

వాస్తవానికి సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి ఆయా పనులు చేపట్టిన ప్రదేశాల్లో నిధులు ఏ కంపెనీ కేటాయించింది, పని అంచనా విలువ ఎంత, ఎన్ని నిధులు ఖర్చు చేశారు, ఎటువంటి పనులు చేపట్టారు తదితర వివరాలతో కూడిన బోర్డులు ఏర్పాటు చేయాలి. కానీ గణపర్తి వద్ద శారదా నది ఎడమ గట్టు రిటైనింగ్ వాల్, డైవర్షన్ వాల్ పనులకు సంబంధించి బోర్డులు ఏర్పాటు చేయలేదు. అప్పటి మంత్రులు, ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేసి, ఆవిష్కరించిన శిలాఫలకాలు మాత్రమే కనిపిస్తున్నాయి. శిలాఫలకాలపై పని అంచనా విలువ ఎంత అన్నది మాత్రమే వుంది.

నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలి

వాస్తవానికి కంపెనీలు, పరిశ్రమలు సామాజిక బాధ్యత కింద కేటాయించే నిధులతో జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో సంబంధిత శాఖల ఇంజనీరింగ్ అధికారుల ఆధ్వర్యంలో పనులు జరగాలి. కానీ ఎస్‌ఈజెడ్‌లోని ఏషియన్ పెయింట్స్‌తోపాటు వివిధ ఫార్మా కంపెనీలు ఇచ్చిన సీఎస్ఆర్ నిధులను వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు యథేచ్ఛగా స్వాహా చేశారు. స్థానిక సర్పంచుల పేరుతో నామినేషన్ విధానంలో పనులు చేపట్టినట్టు రికార్డుల్లో చూపి నిధులను స్వాహా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైసీపీ హయాంలో సీఎస్ఆర్ నిధుల వ్యయంపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.

బడి భోజనం.. నాణ్యత లోపం!

... 5వ పేజీ తరువాయి

ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో 23,378 మంది, అప్పర్ ప్రైమరీ స్కూళ్లలో 9,500 మంది, ఉన్నత పాఠశాలల్లో 62,559 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి పాఠశాలల పనిదినాల్లో మధ్యాహ్నం భోజనం పెట్టాలి. ఇందుకు నిర్వాహక ఏజెన్సీలకు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. భోజనం తయారీకి అవసరమై బియ్యం, కోడిగుడ్లను ప్రభుత్వం సరఫరా చేస్తుంది. కూరగాయలు, పప్పుదినుసులు, ఇతర వస్తువులు, వంట గ్యాస్‌ను నిర్వాహకులు సమకూర్చుకోవాలి. ఒక్కో విద్యార్థికి ఒకటి నుంచి ఐదో తరగతి వరకు రోజుకు రూ.7.75, ఆరు నుంచి పదో తరగతి వరకు రూ.8.55 చొప్పున ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుంది.

ఏ రోజు.. ఏం వడ్డించాలి..

సోమవారం హాట్ పొంగలి, ఉడికించిన గుడ్డు లేదా కూరగాయల పులావ్, గుడ్డు కూర, చెక్కీ పెట్టాలి. మంగళవారం చింతపండు పులిహోరా, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు; బుధవారం కూరగాయల అన్నం, బంగాళాదుంపల కుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కీ; గురువారం సాంబార్ బాత్ లేదా టమాటా చెట్నీతో నిమ్మరసం రైస్, ఉడికించిన గుడ్డు పెట్టాలి. శుక్రవారం అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ; శనివారం ఆకుకూర అన్నం, పప్పుచారు, తీపి పొంగలి పెట్టాలి.

మండుతున్న ధరలతో..

బియ్యం, కోడిగుడ్లను ప్రభుత్వం సరఫరా చేస్తున్నప్పటికీ మిగిలిన సరకులు, కూరగాయల ధరలు మండిపోతుండడంతో ప్రభుత్వం ఇచ్చే బిల్లులు చాలడంలేదని నిర్వాహకులు వాపోతున్నారు. ఈ ప్రభావం భోజనం నాణ్యతపై పడుతున్నది. ప్రధానం కందిపప్పు, కారం, వంట నూనెల ధరలు చాలా నెలల నుంచి చుక్కలనంటాయి. ఇక టమాటా, బంగాళా దుంపలు, దొండకాయలు, ఇతర కూరగాయల ధరలు రెండు, మూడు నెలల నుంచి కిలో రూ.40కి తగ్గడంలేదు. ఉల్లిపాయలు అయితే ఆరు నెలల నుంచి కిలో రూ.50కి పైనే ధర పలుకుతున్నది. అధిక ధరలతోపాటు ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో భోజనంలో నాణ్యత లోపిస్తున్నది. ఆరో తరగతి విద్యార్థికి, పదో తరగతి విద్యార్థికి ఒకే విధంగా భోజనం పెడుతున్నారు. కూరలు, సాంబారు కొద్దికొద్దిగా వడ్డిస్తున్నారు. దీని వల్ల విద్యార్థులు పోషకాహారానికి దూరమవుతున్నారు. మరోవైపు హాట్ పొంగలి, నిమ్మరసం అన్నం, పులిహార పెట్టే రోజుల్లోల అధిక శాతం విద్యార్థులు స్కూల్ భోజనం చేయడానికి ఇష్టపడడం లేదు. ఈ విషయం తల్లిదండ్రుల దృష్టికి రావడంతో పలువురు ఇళ్ల నుంచి భోజనాలు పంపిస్తున్నారు.

జోరుగా అభివృద్ధి

... 5వ పేజీ తరువాయి

పథకం కింద పెద్దఎత్తున నిధులు మంజూరు చేశారు. దీనిలో భాగంగా సబ్బవరం మండలంలో అత్యవసరమైన 63 రోడ్ల పనులకు ప్రతిపాదనలు పంపగా, ప్రభుత్వం రూ.4.06 కోట్లు మంజూరు చేసింది. దీంతో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటి వరకు 2,113.5 మీటర్ల సీసీ రోడ్లు, 350 మీటర్ల మేర డ్రైనేజీ కాలువలు నిర్మించారు. డిసెంబరు నెలాఖరునాటికి అన్ని పనులు పూర్తిచేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

రోడ్ల సమస్యలకు కూటమి ప్రభుత్వం పరిష్కారం



ఆకుల శ్రీహేమ, సర్పంచ్, వంగలి పంచాయతీ

వైసీపీ అధికారంలో వున్నంత కాలం పంచాయతీలను నిర్వీర్యం చేసింది. గ్రామాల్లో వీధి దీపాల నిర్వహణ, పారిశుధ్య పనులకు సైతం నిధులు లేకుండా చేసింది. రోడ్లను బాగుచేయడానికి నిధులు లేకపోవడంతో ప్రజల ముందు తలెత్తుకుని తిరగలేకపోయాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడంతో ఊపిరిపీల్చుకుంటున్నాం. ఉపాధి నిధులతో చేపట్టిన పనులు త్వరలోనే పూర్తవుతాయి.

విశాఖ-2 ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

విశాఖపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం-2 ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న పి.చిన్నారావును సస్పెండ్ చేస్తూ ఆ శాఖ డైరెక్టర్ చంద్రశేఖర వర్మ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. విచారణ పూర్తయ్యేంత వరకు విశాఖపట్నం వదిలి వెళ్లకూడదని ఆదేశించారు. చిన్నారావు ప్రస్తుతం అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల బాధ్యతలు చూస్తున్నారు. ఇప్పుడు ఆయన సస్పెండ్ కావడంతో ఆ బాధ్యతలను విశాఖపట్నం-1 ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌కు అప్పగించారు. ఇప్పటికే తగిన వనరులు లేక అన్ని పరిశ్రమలను సకాలంలో తనిఖీ చేయలేకపోతున్నామని అధికార వర్గాలు వాపోతున్నారు. ఇటువంటి సమయంలో ఏకంగా రెండు జిల్లాల బాధ్యతలను ఇంకో అధికారికి అప్పగించడంపై విస్మయం వ్యక్తమవుతోంది. అనకాపల్లి జిల్లాలో అత్యధిక సంఖ్యలో పరిశ్రమలు ఉన్నాయి. అక్కడే నిత్యం ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలా ఒక్కరిపైనే భారం మోపకుండా వేరొక అధికారిని ప్రత్యేకంగా నియమించాల్సిన అవసరం ఉంది. సకాలంలో తనిఖీలు నిర్వహించకపోతే ప్రమాదాల సంఖ్య పెరిగే ప్రమాదం ఉంది. ఇదిలావుండగా పి.చిన్నారావు సస్పెన్షన్‌కు గల కారణాలేమిటో సంబంధిత శాఖ అధికారులు బయటకు వెల్లడించడం లేదు.

రాజీ కుదిరింది... కేసు కొట్టివేయండి

» విశాఖ కోర్టు కేసుపై హైకోర్టులో మంత్రి అనిత పిటిషన్

అమరావతి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): 'విశాఖ కోర్టులో చెక్ బౌన్స్ కేసు పెండింగ్‌లో ఉంది. దానిలో ఫిర్యాదిదారుడు వేగి శ్రీనివాసరావుకు, నాకు మధ్య రాజీ కుదిరింది. సంబంధిత కేసును కొట్టివేయాలి' అని కోరుతూ హోం మంత్రి వంగలపూడి అనిత హైకోర్టులో పిటిషన్ వేశారు. 'ఇరువైపుల పెద్దలు, శ్రేయోభిలాషులు వివాదాన్ని రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సలహా ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఇరువురం రాజీపత్రాన్ని రాసుకున్నాం. ఆ పత్రాన్ని విశాఖ 7వ ప్రత్యేక మేజిస్ట్రేట్ ముందు ఉంచామన్నారు. ప్రస్తుత పిటిషన్‌కూ జత చేశాం. ఈ నేపథ్యంలో విశాఖ కోర్టులోని సీసీ నంబరు(320/2019)ని కొట్టివేయాలి. హైకోర్టులో జరిగే విచారణకు నా తరఫున సందు జగదీశ్ సాయి అనే వ్యక్తి హాజరవుతారు. అవసరమైన పత్రాలపై సంతకం చేస్తారు. అందుకు వీలుగా పవర్ ఆఫ్ అటార్నీ ఇస్తూ నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపరును వ్యాజ్యంతో జత చేశా' అని పిటిషన్‌లో పేర్కొన్నారు. తన వద్ద నుంచి తీసుకున్న రూ.70 లక్షల అప్పును చెల్లించేందుకు 2018లో అనిత చెక్కు ఇచ్చారని, అది చెల్లలేదని పేర్కొంటూ వేగి శ్రీనివాసరావు విశాఖపట్నం కోర్టులో 2019లో పిటిషన్ దాఖలు చేశారు.

కల్తీపై కొరడా

విశాఖపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాల్లో కల్తీ చేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న పలు వ్యాపార సంస్థలపై జిల్లా అడిషనల్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ కోర్టు కొరడా ఝుళిపించింది. గత కొంతకాలంగా ఆహార భద్రతా, ప్రమాణాల శాఖ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో సేకరించిన నమూనాలను పరీక్షలకు పంపారు. ఆ ఫలితాలు తాజాగా వచ్చాయి. కొన్ని దుకాణాలు/స్టోర్స్‌లో కల్తీ జరిగినట్టు తేలడంతో కేసులు నమోదుచేశారు. ఇవి శుక్రవారం జాయింట్ కలెక్టర్/అడిషనల్ డిస్ట్రిక్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారణకు వచ్చాయి. ఏడు కేసులకు సంబంధించి కల్తీ నిర్ధారణ కావడంతో జరిమానా విధిస్తూ అడిషనల్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ తీర్పును వెలువరించారు. మొత్తం ఏడు వ్యాపార సంస్థలకు రూ.2,80,000 జరిమానా విధించారు.

గాజువాకలోని శ్రీవిజయ విశాఖ పార్లర్‌లో విక్రయిస్తున్న టోన్డ్ మిల్క్‌లో కల్తీ జరిగినట్టు తేలడంతో ఆ సంస్థ (శ్రీవిజయ విశాఖ డెయిరీ)కు రెండు లక్షల రూపాయలు జరిమానా విధించారు. అలాగే, కాకాణినగర్‌లోని పంజాబీ దాబాలో పెరుగు కల్తీ జరగడంతో రూ.20 వేలు, గోపాలపట్నంలోని గున్నరాజు ఎంటర్‌ప్రైజెస్‌లో కల్తీ బెల్లాన్ని విక్రయిస్తున్నట్టు నిర్ధారణ కావడంతో రూ.20 వేలు జరిమానా విధించారు. అలాగే, ప్రహ్లాదపురంలోని టీస్టీ మాసాలా స్టోర్‌లో పెసరపప్పు కల్తీ చేసినట్టు తేలడంతో రూ.15 వేలు జరిమానా వేశారు. పెదగంట్యాడలోని సుప్రజ ఫుడ్స్‌లో కలుషితమైన నీటిని ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నట్టు తేలడంతో రూ.10 వేలు, మధురవాడలోని గోపాలకృష్ణ ప్రొడక్ట్స్‌లో టమాటా సాస్‌లో కల్తీ జరిగినట్టు తేలడంతో రూ.10 వేలు జరిమానా విధించారు. అలాగే పెందుర్తిలోని బెంగళూరు అయ్యంగార్ బేకరీలో బ్రెడ్ కల్తీ అయినట్టు తేలడంతో షాపు యజమానికి రూ.5 వేలు జరిమానా విధిస్తూ అడిషనల్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్, జాయింట్ కలెక్టర్ మయూర్‌అశోక్ తీర్పును వెలువరించారు. ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు సాగించే వారిపై కేసులు నమోదు చేస్తున్నామని, శుక్రవారం విచారణ పూర్తికావడంతో అడిషినల్ డిస్ట్రిక్ మేజిస్ట్రేట్ జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారని ఆహార భద్రతా, ప్రమాణాల శాఖ అధికారులు తెలిపారు. కల్తీ చేస్తున్నట్టు అనుమానం ఉంటే తమకు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. కల్తీ చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, లైసెన్సులు కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే కేసులు నమోదు చేస్తామన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం

» అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా

» కైలాసగిరి పోలీస్ పరేడ్ మైదానంలో స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

విశాఖపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నిత్యం పని ఒత్తిడితో ఉండే పోలీసులకు క్రీడల వల్ల శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా అన్నారు. కైలాసగిరి పోలీస్ పరేడ్ మైదానంలో వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసులు ఏడాదంతా మానసిక ఒత్తిడిని అధిగమిస్తూ విధులు నిర్వర్తిస్తుంటారని, వారికి క్రీడా పోటీల నిర్వహణ వల్ల మానసిక ఒత్తిడి దూరమై ఉల్లాసం కలుగుతుందని చెప్పారు. కాగా రెండు రోజులు పాటు జరిగే ఈ పోటీల్లో అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, టగ్‌వార్, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం. దేవీప్రసాద్, ఎల్. మోహన్‌రావు, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎం. శ్రావణి, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ మోహన్, ఏఆర్ డీఎస్పీ పి. నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.